

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | సోమవారం 03-03-2025 | సంపుటి - 21 | సంచిక - 312 | రూ : 4 | పేజీలు: 8




## కేసీఆర్ సంతకం యమపాశమైంది

- కృష్ణా జలాల్లో 511 టీఎంసీలు ఏపీకి ఇచ్చింది ఆయనే
- రాష్ట్ర ప్రజలపై కిషన్‌రెడ్డి పగబట్టారు
- వనపర్తిని అభివృద్ధి పథంలో నిలిపే బాధ్యత నాది
- ప్రజాపాలన-ప్రగతిబాట సభలో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్ వనపర్తి : కృష్ణా జలాల్లోని 811 టీఎంసీల్లో 511 టీఎంసీలు ఏపీకి తీసుకెళ్లవచ్చంటూ.. నాడు కేసీఆర్ పెట్టిన సంతకం తెలంగాణ రైతుల పాలిట యమపాశమైందని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. రాయలసీమకు నీటిని తరలించడానికి కేసీఆర్ కారణం కాదా అని ప్రశ్నించారు. నాడు పోతిరెడ్డిపాడు సామర్థ్యం పెంచి వై.ఎస్. సీమకు నీరు తీసుకెళితే.. తరువాత ఆయన కుమారుడు జగన్ ఏపీ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నాటి తెలంగాణ సీఎం కేసీఆర్ ప్రగతిభవన్‌కు పిలిచి పంచభక్ష్య పరమాన్నాలు పెట్టి రాయలసీమ ఎత్తిపోతలకు పునాదులు వేయలేదా అని రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. కేసీఆర్ పాలమూరు ద్రోహి అని దుయ్యబట్టారు. రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసే ఇందిరమ్మ మహిళా శక్తి తదితర పథకాలను ఆదివారం వనపర్తిలో సీఎం రేవంత్ ప్రారంభించారు. వివిధ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు హాజరైన ఆయన స్థానిక పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన స్టాళ్లను ప్రారంభించారు. రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ ద్వారా 50 మంది ముస్లిం, క్రిస్టియన్ మైనార్టీ వర్గాల మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. అనంతరం నిర్వహించిన 'ప్రజాపాలనప్రగతి బాట' సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడారు. "కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, కవితలు నన్ను.. సీఎం పదవి నుంచి దిగుతావా లేదా అని అడుగుతున్నారు. మా పాలమూరుకు మీరు నీళ్లు తెచ్చారా? పదేళ్లుగా మీరు ప్రాజెక్టులు కడితే ఇక్కడి నుంచి వలసలు

తరువాయి 2లో

## కొత్త రేషన్‌కార్డుల జారీలో సా..గదీత

- కోడ్ లేని జిల్లాల్లోనూ ప్రారంభంకాని పంపిణీ
- పరిశీలించింది.. కులగణనలో వచ్చిన అర్జీలనే
- ప్రజాపాలన దరఖాస్తులు ఎక్కడివి అక్కడే!

హైదరాబాద్: కొత్త రేషన్‌కార్డుల కోసం లక్షల మంది దరఖాస్తుదారులకు ఎదురుచూపులు తప్పడంలేదు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ లేని మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, నాగర్‌కర్నూల్, గద్వాల, వికారాబాద్, మేడ్చల్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల్లో ఈ నెల 1వ తేదీ నుంచే కొత్తకార్డులు ఇవ్వాలన్న ప్రభుత్వ నిర్ణయమూ అమల్లోకి రాలేదు. హైదరాబాద్‌లో దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ ఆలస్యమైందని అధికారులు చెబుతున్నారు. మిగిలిన 8 జిల్లాల్లో పది రోజుల ముందే దరఖాస్తుల పరిశీలన, అర్హుల ఎంపిక పూర్తయినా.. కార్డులు ఎందుకు జారీ చేయలేదన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. కులగణన సర్వేలో 6.68 లక్షల కుటుంబాలు తమకు రేషన్‌కార్డులు కావాలని కోరాయి. ఇందులో 5.12 లక్షల కుటుంబాలను ప్రాథమికంగా అర్హమైనవిగా పౌరసరఫరాలశాఖ గుర్తించినట్లు సమాచారం. ఇందులో మార్చి 1న సుమారు లక్ష మందికి కొత్త రేషన్‌కార్డులు ఇచ్చేలా ప్రణాళికలు సిద్ధం అయ్యాయి. కోడ్ లేని జిల్లాల్లో కొత్త రేషన్‌కార్డులు జారీ

తరువాయి 2లో




## ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రాజెక్టును పూర్తి చేస్తాం



- పదేళ్లు ఎస్ఎల్‌బీసీని పక్కన పెట్టిన భారాస
- బిల్లులు చెల్లించలేదు.. విద్యుత్ నిలిపివేశారు
- కాళేశ్వరం, దేవాదులలో ప్రమాదాలు జరిగితే నాటి పెద్దలు వెళ్లనేలేదు సీఎం రేవంత్‌రెడ్డి విమర్శలు
- సొరంగ ప్రమాదంపై మరో 2,3 రోజుల వరకు ఏమీ చెప్పలేం
- బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని వెల్లడి

మహబూబ్‌నగర్: శ్రీశైలం ఎడమగట్టు కాలువ సొరంగం (ఎస్ఎల్‌బీసీ) కూలిన ఘటనపై అధికార, ప్రతిపక్షాలు ఐక్యంగా

తరువాయి 2లో



## సునీల్‌కుమార్ సస్పెన్షన్...

2లో

- జగన్ జమానాలో అనధికారికంగా విదేశీ పర్యటనలు
- అనుమతి లేకుండా తరచూ దుబాయ్‌కి
- జార్జియా పర్యటన ముసుగులో యూఏఈకి
- అమెరికా వెళ్తున్నానంటూ యూకేకి
- సస్పెన్షన్ ఉత్తర్వులిచ్చిన ప్రభుత్వం

## సోమనాథుడికి మోదీ ప్రత్యేక పూజలు

- అంతకుముందు 'వన్‌తారా సందర్శన

2లో



## రుద్రనేలలోనే.. నీలమ్మ నిద్రాహారాలు

- 70 ఏళ్ల వయసులో సమాధులు తవ్వుతూ ఉపాధి
- మైసూరు శ్మశానంలోనే కుటుంబంతో జీవనం

2లో





## ఐరోపా భద్రతకు నడుం బిగిద్దాం

- తరానికోసారి తలెత్తే సందర్భంపై స్పందిద్దాం
- ఉక్రెయిన్‌కు మంచితోనే ప్రపంచ శాంతి
- ఐరోపా దేశాల సదస్సులో బ్రిటన్ ప్రధాని స్టార్మర్ పిలుపు
- కాల్పుల విరమణపై కలిసి పని చేద్దాం
- యూకే, ఫ్రాన్స్, ఉక్రెయిన్ నిర్ణయం

2లో

## ఏవియేషన్ హబ్‌గా తెలంగాణ




- యువతకు పెద్దఎత్తున ఉద్యోగాలు
- ప్రధాని మోదీ చొరవతోనే వరంగల్‌కు విమానాశ్రయం
- కేంద్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, కిషన్‌రెడ్డి

హైదరాబాద్: తెలంగాణను ఏవియేషన్ హబ్‌గా చేయాలన్న ఆలోచన ఉందని.. తద్వారా ఏరోస్పేస్ తయారీ రంగంలో యువతకు పెద్దఎత్తున ఉద్యోగాలు లభిస్తాయని పౌరవిమానయానశాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు, కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. 'ప్రస్తుతం విదేశాల్లో విమానాలు తయారవుతున్నాయి. ప్రధాని నరేంద్ర మోదీ విమానాల తయారీ రంగాన్ని దేశానికి తీసుకురావాలని గట్టిగా కృషి చేస్తున్నారు. ఈ రంగాన్ని హైదరాబాద్‌కు తీసుకురావాలని ప్రయత్నిస్తున్నాం. ప్రధాని జోక్యం చేసుకోవడంతోనే వరంగల్‌కు విమానాశ్రయం వచ్చింది. స్వాతంత్ర్యానికి

తరువాయి 2లో

# కేసీఆర్ సంతకం యమపాశమైంది

(మొదటిపేజీ తరువాయి)

ఎందుకు ఆగలేదు? భాక్రానంగల్ నుంచి నాగార్జునసాగర్ వరకూ, శ్రీశైలం నుంచి శ్రీరాంసాగర్ వరకూ మా చెమటతో కట్టాం. మీరు నిర్మించిన ప్రాజెక్టు ఏదైనా ఉందా..? ఆర్డీఎస్ ప్రాజెక్టు ఎందుకు ఎండిపోయింది? ఎస్ఎల్‌బీసీ గతంలో కాంగ్రెస్ సర్కారు మొదలుపెట్టి 32 కిలోమీటర్ల తవ్వకం పూర్తిచేస్తే.. మిగిలిన పనులు భారాస పాలనలో నిలిపివేశారు. ఆ కారణంగానే నేడు టన్నెల్ కుప్పకూలి.. 8 మంది గల్లంతయ్యారు. ఈ పాపం కేసీఆర్‌ది కాదా? భారాస పాలనలో బడి పిల్లల యూనిఫాంలు కుట్టే పనుల్ని పెద్ద కంపెనీలకు ఇచ్చి కమీషన్లు తీసుకున్నారు. ఇప్పుడు పాఠశాలలు, హాస్టళ్లలో 1.30 కోట్ల జతల దుస్తులు కుట్టించి ఇచ్చే వ్యాపారం మహిళలకు ఇచ్చాం. 4.50 లక్షల ఇళ్లు పేద ఆడబిడ్డల పేరుమీద ఇస్తున్నాం. గత పదేళ్ల భారాస పాలనలో స్వయంసహాయక సంఘాలు నిర్వీర్యమయ్యాయి. మేం వాటికి రూ.వేల కోట్లు అందించి అభివృద్ధిపథంలో నడిపిస్తున్నాం. గత పదేళ్లు కేసీఆర్ ఆయన ఇంట్లో వాళ్లకి మాత్రమే ఉద్యోగాలిచ్చారు. మేం 55 వేల కొలువులిచ్చాం.

*** అభివృద్ధికి కిషన్‌రెడ్డి అడ్డం పడుతున్నారు**

తెలంగాణకు నువ్వేం చేశావని నన్ను కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అడుగుతున్నారు. వరంగల్‌లో ఎయిర్‌పోర్టు నేను కష్టపడి తెస్తే.. తానే తెచ్చానని ఆయన అంటున్నారు. మెట్రో విస్తరణ, మూసీకి నిధులు రాలేదంటే.. ఆపింది ఆయనే కదా.. ఆయన కడుపు నిండా అసూయ, కుళ్లు పెట్టుకుని కాళ్లలో కట్టె పెట్టే పనులు చేస్తున్నారు. కేంద్రమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ హైదరాబాద్‌కు వచ్చి అభివృద్ధి పనులపై సమీక్షిస్తే ఈ ప్రాంత ఎంపీ అయిన కిషన్‌రెడ్డి ఎందుకు డుమ్మా కొట్టారు? మెట్రోను మేడ్చల్ వరకూ పొడిగించాలని ఆ సమావేశంలో ఈటల అడిగింది నిజం కాదా? కర్ణాటకలో ప్రతిపక్షంలో ఉన్న భాజపా నేత శోభ మెట్రో విస్తరణకు అనుమతి తీసుకువెళ్లారు. చెన్నై మెట్రోకు నిర్మలా సీతారామన్ అనుమతిచ్చారు. కానీ హైదరాబాద్ మెట్రో విస్తరణకు కిషన్‌రెడ్డి అడ్డుపడుతున్నారు. తెలంగాణ అభివృద్ధికి సహకరించాలని ఆయన ఇంటికి వెళ్లి మరీ అడిగాను. తెలంగాణకు ఏదీ రాకపోవడానికి సమస్య మోదీ కాదు. రాష్ట్రానికి ఏమైనా ఇవ్వాలని ప్రధానికి ఉంది. కానీ కిషన్‌రెడ్డి ఎందుకు అడ్డుపడుతున్నారో తెలియడంలేదు.

**వనపర్తిలో సర్వం నేర్చుకున్నా**

నాకు వనపర్తి.. చదువు.. సంస్కారం నేర్పి విద్యార్థి రాజకీయాల్లో చైతన్యం ఇచ్చింది. ఇక్కడ సర్వం నేర్చుకున్నా. వనపర్తి పట్టణాన్ని, నియోజకవర్గాన్ని అభివృద్ధిపథం వైపు నడిపి.. గొప్పకీర్తిని తీసుకొస్తాను. ఈ ప్రాంతంలో జైరాములు యాదవ్, బాలకిష్టయ్య, చిన్నారెడ్డి, రావుల చంద్రశేఖరరెడ్డిల మధ్య 4 దశాబ్దాలు సిద్ధాంతపరంగా, అభివృద్ధిపరంగా పోటాపోటీ ఉన్నా అప్పుడు ఎక్కడా రాజకీయకక్షల్లేవు.. అభివృద్ధి చేయడంలో వారు పోటీపడ్డారు. ఐదేళ్ల క్రితం ఇక్కడ ఎమ్మెల్యేగా ఎన్నికైన వ్యక్తి వనపర్తి రాజకీయాలను కలుషితం చేసి కుట్రలకు వేదికగా మార్చి గొప్ప పేరును దెబ్బతీశారు. విద్యార్థి రాజకీయాల్లో క్రియాశీలకంగా ఉంటూ తెలంగాణకు ముఖ్యమంత్రినై ఈరోజు మీ ముందు నిలబడటం నాకు గర్వకారణం. ఈ రోజు రూ.వెయ్యికోట్ల పనులను ప్రారంభించాం. మాజీ ఎమ్మెల్యేలు జయరాములు, బాలకిష్టయ్య, చిన్నారెడ్డి పేర్లను ఈ ప్రాంత ప్రాజెక్టులకు పెడతాం. పాలమూరును పసిడి పంటల జిల్లాగా మార్చే బాధ్యత నాది. 25 లక్షల ఎకరాలకు నీరు పారించే బాధ్యత తీసుకుంటాను'' అని సీఎం హామీ ఇచ్చారు.

# కొత్త రేషన్‌కార్డుల జారీలో సా..గదీత

(మొదటిపేజీ తరువాయి)

చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారి ఆదేశించి పక్షం రోజులు దాటుతోంది.

**రేషన్‌కార్డు లేక పరేషాన్**

రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలకు రేషన్‌కార్డునే అర్హతగా తీసుకుంటున్నారు. ఆరోగ్యశ్రీ, 200 యూనిట్ల వరకు ఉచితంగా గృహవిద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్ వంటి పథకాలను పొందాలంటే రేషన్‌కార్డు తప్పనిసరి. రేషన్‌కార్డుల్లో పేర్లున్నా.. కొన్ని కుటుంబాల్లో పెళ్లయిన తర్వాత విడిగా ఉంటున్న కుమారులు, కోడళ్లకు ఈ పథకాల ప్రయోజనం అందడం లేదు. మొత్తంగా లక్షల కుటుంబాలు కొత్త రేషన్‌కార్డులు అందక ఆయా పథకాల ప్రయోజనాలు పొందలేకపోతున్నారు. జనవరి 26న 16,900 కుటుంబాలకు మాత్రమే కొత్త రేషన్‌కార్డులు జారీచేసిన విషయం తెలిసిందే.

*** ప్రజాపాలనలో 18 లక్షల పైనే దరఖాస్తులు**

కొత్త రేషన్‌కార్డుల కోసం ప్రజాపాలనలో, ప్రజావాణిలో, మీసేవా వెబ్‌సైట్‌లో, కులగణన (సామాజిక, ఆర్థిక సర్వే)లో అర్జీలు అందాయి. పౌరసరఫరాలశాఖ ప్రస్తుతం పరిశీలిస్తున్నవి కులగణన దరఖాస్తులు మాత్రమేనని సమాచారం. ప్రజాపాలన కార్యక్రమంలో కొత్త రేషన్‌కార్డుల కోసం వచ్చిన దరఖాస్తులు దాదాపు 18 లక్షలపైనే ఉన్నాయని సమాచారం. ఏడాది కాలం దాటిపోతున్నా.. వాటిలో కదలిక లేకపోవడంతో దరఖాస్తుదారుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

*** ఇచ్చేది సాధారణ కార్డులే.. అయినా ఆలస్యం**

ఏటీఎం కార్డు తరహాలో ప్రత్యేకంగా చిప్ ఉండేలా కొత్త రేషన్‌కార్డులు జారీచేయాలని ప్రభుత్వం గతేడాది భావించింది. వివిధ రాష్ట్రాల్లో అధికారులు అధ్యయనం సైతం చేశారు. అయినా ఏ నిర్ణయమూ తీసుకోలేదు. దీంతో కొత్త రేషన్‌కార్డుల్ని సాధారణ పద్ధతిలోనే ఇవ్వాలని సీఎం ఆదేశించినా.. అడుగులు ముందుకు పడడంలేదు.

## ఎట్టి పరిస్థితుల్లోనూ

# ప్రాజెక్టును పూర్తి చేస్తాం

(మొదటిపేజీ తరువాయి)

నిలవాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ప్రమాదంలో చిక్కుకున్న వారిని రక్షించేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు చేపడుతోందని, రెండు మూడు రోజుల వరకు ఏ విషయం అధికారికంగా చెప్పలేమని స్పష్టం చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం దోమలపెంట సమీపంలో ప్రమాదం చోటుచేసుకున్న ఎస్ఎల్‌బీసీ సొరంగాన్ని సీఎం ఆదివారం సాయంత్రం పరిశీలించారు. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, బాలూ నాయక్‌లతో కలిసి సొరంగంలోకి వెళ్లి సహాయ చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు, జాతీయ, రాష్ట్ర సంస్థలతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ముఖ్యమంత్రి విలేకరులతో మాట్లాడారు. ''ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టును 200506లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం అధునాతన సాంకేతికతతో టీబీఎం (టన్నెల్ బోరింగ్ మెషిన్) ద్వారా ప్రారంభించింది. దీని తవ్వకం తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావంలోపే 30 కిలోమీటర్ల మే పూర్తయింది. రాష్ట్రం ఏర్పాటయ్యాక ఈ ప్రాజెక్టును వేగంగా పూర్తి చేస్తారని మేం విశ్వసించాం. కానీ, నాటి ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. నిర్మాణ సంస్థకు బిల్లులు చెల్లించకపోగా.. విద్యుత్ సరఫరా నిలిపివేసింది. దీంతో పదేళ్ల పాటు పనులు నిలిచిపోయాయి. మా ప్రభుత్వం వచ్చిన వెంటనే ఈ ప్రాజెక్టుపై దృష్టి పెట్టింది. సంస్థలకు బిల్లులు చెల్లించి, నిపుణులతో చర్చించాం. అమెరికా నుంచి టీబీఎం, ఇతర పరికరాలను రప్పించాం. పనులు వేగంగా పూర్తిచేసి నల్గొండ నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని మేం చిత్తశుద్ధితో పనిచేస్తుంటే అనుకోకుండా ఈ దుర్ఘటన జరిగింది. బాధితులకు ప్రభుత్వం, ప్రతిపక్షం అంతా అండగా నిలిచి ఆదుకోవాలి.

**దుర్ఘటన జరిగిన గంటలోపే మంత్రులు**

గత నెల 22న ప్రమాదం జరిగిన గంటలోపే మంత్రులు ఉత్తమ్, జూపల్లి ఇక్కడికి చేరుకున్నారు. ప్రభుత్వ వ్యవస్థ అంతా ఇక్కడే ఉండి పనిచేస్తోంది. ప్రతి రెండు మూడు గంటలకు నేను వివరాలు తెలుసుకుంటూనే ఉన్నాను. నిరంతరం ఆర్మీ, మరో 11 సంస్థలు పనిచేస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు, ప్రైవేటు ఏజెన్సీలు కూడా పాల్గొంటున్నాయి. గల్లంతైన వారి వివరాలు ఇప్పటికీ తెలియరాలేదు. అవిశ్రాంతంగా సహాయ చర్యల్లో పాల్గొంటున్న సంస్థలను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నా. దేశ ప్రధాని నుంచి మొదలు ప్రతిఒక్కరూ వారి సలహాలు, సూచనలు అందించారు. ప్రమాదం జరిగినా.. మేం మనోధైర్యం కోల్పోలేదు. పట్టుదలతో ప్రాజెక్టు పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నాం. సొరంగంలో ఊట వస్తోందని నిపుణులు చెబుతున్నారు. 13.50 కిలోమీటర్ల దూరంలో పనిచేస్తుండటం క్లిష్టంగా మారింది. సోమవారం సాయంత్రానికి కన్వేయర్ బెల్ట్ మరమ్మతు చేసి మట్టిని బయటకు పంపేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. మట్టి కింద మనుషులు, యంత్రాలు ఎక్కడ ఉన్నాయనే నిపుణులు ఒక అంచనాకు రాలేకపోతున్నారు.

**మేం ఎవరినీ నిందించడం లేదు**

సొరంగం పైకప్పు కూలిన ఘటనపై కొందరు రాజకీయ ఆరోపణలు చేస్తున్నారు. బురద చల్లే పనిచేస్తున్నారు. కానీ, మేం ఎవరినీ నిందించడం లేదు. మా లోపం ఎక్కడైనా ఉందా? భారాస పరిపాలనలో శ్రీశైలం జల విద్యుత్ కేంద్రంలో అగ్ని ప్రమాదం జరిగితే ఎవరినీ అక్కడికి వెళ్లనివ్వలేదు. నేను పీసీసీ అధ్యక్షుడిగా శ్రీశైలం వెళ్లేందుకు ప్రయత్నిస్తే అరెస్టు చేసి జైల్లో పెట్టారు. కాళేశ్వరం, దేవాదుల ప్రాజెక్టుల్లో మరణాలు సంభవిస్తే నాడు విపక్షాలను రానీయలేదు. ప్రభుత్వ పెద్దలు మాత్రం అక్కడికి వెళ్లనేలేదు. మేం మాత్రం ప్రతిపక్షాలు సొరంగం పరిశీలనకు వస్తే అనుమతించాం. మేం పారదర్శకంగా ఉన్నా మమ్మల్ని తప్పు పట్టాలని చూస్తున్నారు.

**ప్రతిపక్ష నాయకుడు ఎక్కడ?**

ఇంత పెద్ద ప్రమాదం జరిగితే రాష్ట్రంలో ప్రతిపక్ష నాయకుడు కె.చంద్రశేఖర్‌రావు ఎక్కడున్నారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఏ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. నేను ఎన్నికల ప్రచారానికి వెళ్లానని విమర్శించిన హరీశ్‌రావు.. సొరంగంలో ప్రమాదం జరిగినప్పుడు దుబాయ్‌లో దావత్ చేసుకోలేదా. కాదంటే పాస్‌పోర్ట్ వివరాలు బయట పెట్టమనండి. లేదంటే నేను బయటపెడతా. దేవాదుల ప్రమాదంలో చిక్కుకున్న వారి మృతదేహాలు ఐదేళ్ల వరకు దొరకలేదు. ఈ విషయాన్ని ప్రతిపక్షం మర్చిపోతే ఎలా? శ్రీశైలం జలవిద్యుత్ కేంద్రంలో ప్రమాదం జరిగితే మరమ్మతులు చేయనేలేదు. మానవ తప్పిదంతో నాడు ప్రమాదం జరిగింది. ఎస్ఎల్‌బీసీ ప్రమాదం ప్రకృతి విపత్తు.. బాధిత కుటుంబాలను ప్రభుత్వం తప్పకుండా ఆదుకుంటుంది.

**రోబోల వినియోగానికి ఆదేశం**

సొరంగంలో సహాయక చర్యలకు రోబోలను వినియోగించాలని యంత్రాంగాన్ని ఆదేశించాం. ప్రపంచంలో ఎక్కడ ఏరకమైన పరికరాలు, నిపుణులున్నా రప్పించేందుకు ప్రయత్నిస్తున్నాం. ఇప్పటికే ఎన్డీఆర్ఐ పలుచోట్ల కొన్నింటి ఉనికిని ప్రాథమికంగా గుర్తించింది. ఆ ప్రాంతాలకు ర్యాట్ హోల్ మైనర్స్ వెళ్లారు. కానీ, అక్కడ మనుషుల ఉనికి బయటపడలేదు'' అని సీఎం పేర్కొన్నారు.

*** కుడి.. ఎడమల నుంచి స్కాన్ చేయండి: ఎన్జీఆర్ఐకు సీఎం సూచన**

ఎస్ఎల్‌బీసీ సొరంగం వద్ద నుంచి 'ఈనాడు' ప్రత్యేక ప్రతినిధి: సొరంగంలో చిక్కుకున్న వారిని గుర్తించడానికి మట్టి పైభాగం నుంచి స్కాన్ చేయడం కన్నా.. సొరంగంలో కుడి, ఎడమ వైపులా చివరి వరకు పరికరాలు పంపి పరిశీలన చేస్తే మంచి ఫలితాలు వచ్చే అవకాశాలు ఉన్నాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. మట్టి దిగువ భాగంలో ప్రాథమికంగా పలు చోట్ల ఉనికి గుర్తించినా తవ్వకాలు చేస్తే అక్కడ వేరే పదార్థాలు వెలుగుచూసినట్లు అధికారులు చెప్పగా సీఎం ఈ మేరకు సూచన చేశారు. ఆదివారం సాయంత్రం మంత్రులు ఉత్తమ్, జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, బాలు నాయక్ తదితరులతో కలిసి సీఎం సొరంగాన్ని పరిశీలించిన అనంతరం అధికారులు, ఎన్డీఆర్ఎఫ్, ఎన్జీఆర్ఐ, సైన్యం తదితర సంస్థలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్వో సీనియర్ అధికారి కర్నల్ పరీక్షిత్ మెహ్రా, విపత్తుల నిర్వహణ శాఖ కమిషనర్ అర్వింద్‌కుమార్ సీఎంకు సొరంగంలో సహాయక చర్యలను వివరించారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. 'ప్రమాదంలో చిక్కుకున్న వారిని వీలైనంత త్వరగా బయటకు తీసుకురావాలి. ఈ విపత్తుపై సమగ్ర అధ్యయనం చేపట్టి ఒక డాక్యుమెంట్ రూపొందించాలి. అందరికీ ఇది ఉపయోగపడాలి. మిషన్‌ను ఏవిధంగా బయటకు తీసుకురావాలి. అది పనిచేస్తుందా? లేదా? అనేది చూడాలి. ఇది చాలా సంక్లిష్టమైన విపత్తు. శాశ్వత పరిష్కారంపై దృష్టి సారించాలి' అని సూచించారు.

*** ఐదు మీటర్ల వ్యాసంతో రెండు సొరంగాలతో పని సులువు..**

అధికారులు మాట్లాడుతూ.. అటవీ ప్రాంతం ఉండటంతో సమస్యగా మారిందని, సొరంగంలో 13.30 కిలోమీటరు వరకే వెంటిలేషన్ ఉందని తెలిపారు. భూమి పొరల్లో ఉన్న తేడాలతోనే సొరంగంలో బురద చొచ్చుకువచ్చిందని పేర్కొన్నారు. స్కానింగ్ కొంత క్లిష్టంగా మారిందని ఎన్జీఆర్ఐ అధికారులు తెలిపారు. నిర్మాణ సంస్థ ప్రతినిధి పంకజ్ మాట్లాడుతూ.. ఇప్పుడున్న 10 మీటర్ల వ్యాసంతో సొరంగం నిర్మాణంతో సమస్యలు ఉత్పన్నమైనందున రెండు వైపులా ఐదు మీటర్ల చొప్పున సొరంగాలు తవ్వాలని, కొంత దూరం వెళ్లాక తిరిగి వాటిని కలిపేలా నిర్మిస్తే షీర్‌జోన్ సమస్య నుంచి బయటపడే అవకాశాలు ఉండొచ్చని చెప్పారు. సీఎం స్పందిస్తూ టీబీఎం పనితీరుపై తనకు అవగాహన ఉందని ఆరేళ్ల క్రితం మన్నెవారిపల్లి వైపు లోనికి వెళ్లినట్లు తెలిపారు. సొరంగంలో ఎవరూ చిక్కుకోకుండా సహాయక చర్యలు చేపట్టాలని, మట్టి తొలగించే యంత్రాలను వాడాలని, ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయం కావాలన్నా అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు.

# ఏవియేషన్ హబ్‌గా తెలంగాణ

(మొదటిపేజీ తరువాయి)

పూర్వమే ఆసియాలోనే అతిపెద్ద ఎయిర్‌పోర్టుగా వరంగల్‌కు గుర్తింపు ఉంది. విమానాశ్రయం అందుబాటులోకి వస్తే వరంగల్ అన్నిరంగాల్లో మరింత అభివృద్ధి చెందుతుంది. ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. రాష్ట్ర ప్రభుత్వం వీలయినంత త్వరగా భూసేకరణ పూర్తిచేసి, స్థలాన్ని కేంద్రానికి అప్పగిస్తే రెండున్నరేళ్లలో వరంగల్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణం పూర్తిచేస్తాం'' అని రామ్మోహన్‌నాయుడు, కిషన్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లోని కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల సముదాయం (సీజీవో)లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వీరు మాట్లాడారు. అంతకుముందు వారు 'యోజన కేంద్ర బడ్జెట్ 202526' మ్యాగజైన్‌ను ఆవిష్కరించారు. అనంతరం విలేకరుల సమావేశంలో రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ.. ''వరంగల్‌లో విమానాశ్రయం ఉండాలన్నది ప్రజల చిరకాల కోరిక. 1981 వరకు ఇక్కడ ఉన్న విమానాశ్రయంలో ఏదో రకంగా రాకపోకలు జరిగేవి. హైదరాబాద్‌లోనే అన్ని రంగాలు కేంద్రీకృతం కావడంతో క్రమంగా వరంగల్‌లో డిమాండ్ తగ్గింది. ప్రజల్లో మాత్రం విమానాశ్రయం డిమాండ్ బలంగా ఉంది. 8 నెలల క్రితం నేను మంత్రిగా బాధ్యతలు స్వీకరించినప్పుడు మా నాయకుడు చంద్రబాబు మార్గదర్శకత్వం చేశారు. మంత్రిగా ఆంధ్రప్రదేశ్‌కు ఎంత చిత్తశుద్ధితో పనిచేస్తారో.. తెలంగాణ అభివృద్ధికీ అదేరీతిలో పనిచేయాలని స్పష్టం చేశారు. మామునూరులో ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ)కి 696 ఎకరాల స్థలం ఉంది. ఇప్పుడున్న స్థలంలో ఉన్న రెండు రన్‌వేలు ఉపయోగించుకోలేని స్థితిలో ఉన్నాయి. రన్‌వే పొడవు 1,800 మీటర్లు ఉంది. ఎయిర్‌బస్ లాంటి విమానాలు నడపాలంటే సుమారు 2,800 మీటర్ల రన్‌వే ఉండాలి. దీనికి అదనంగా భూమి కావాలి. ఎప్పటినుంచో ఏఏఐ రాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు జరుపుతోంది. అదనంగా 280 ఎకరాలు సేకరించాలని కేంద్రం నుంచి ప్రయత్నాలు జరిగాయి. శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు 150 కి.మీ. లోపు మరో ఎయిర్‌పోర్టు నిర్మించరాదన్న నిబంధన ఉండేది. దీనికి సవరణ చేస్తూ ఎన్‌వోసీ తీసుకున్నాం. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ భూసేకరణకు ఉత్తర్వులు జారీచేసింది. వరంగల్‌లో విమానాశ్రయం ఏర్పాటుకు కేంద్రం క్లియరెన్స్ ఇచ్చింది. భూసేకరణ ప్రక్రియ పూర్తిచేసి ఏఏఐకి అప్పజెబితే మాస్టర్‌ప్లాన్‌కు అనుగుణంగా ఎయిర్‌బస్సు విమానాలు నడిపే విధంగా నిర్మిస్తాం. వరంగల్ చరిత్ర, సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబించేలా టెర్మినల్ భవనాన్ని ఏర్పాటు చేస్తాం. భద్రాద్రి కొత్తగూడెంలో కూడా చూపిన రెండో స్థలంలో ఏఏఐ ఫీజిబులిటీ పరీక్షలు జరిపింది. తెలంగాణను అన్నిరకాలుగా అభివృద్ధి చేయాలనేది కేంద్రం ఆలోచన. ఒక వారధిలాగా కిషన్‌రెడ్డి పనిచేస్తున్నారు. నేను తెలుగుదేశంలో పార్టీ ఉన్నాను. మాకు జన్మనిచ్చిన స్థానం తెలంగాణ. అలాంటి రాష్ట్రానికి ఎంతో రుణపడి ఉన్నాం. పౌరవిమానయాన మంత్రిగా ఈ ప్రాంతం రుణం తీర్చుకోవడం అదృష్టంగా భావిస్తున్నాను. ఎయిర్‌పోర్టును ఎవరు తీసుకొచ్చారనేది రాజకీయం చేయకుండా ముందుకు వెళ్లాలి'' అని రామ్మోహన్‌నాయుడు పేర్కొన్నారు.

# సునీల్‌కుమార్ సస్పెన్షన్

అమరావతి: సీనియర్ ఐపీఎస్ అధికారి పీవీ సునీల్‌కుమార్‌ను రాష్ట్ర ప్రభుత్వం సస్పెండ్ చేసింది. అఖిల భారత సర్వీసు నియమావళి నిబంధనలను ఆయన ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించారని, తీవ్ర క్రమశిక్షణ రాహిత్యానికి, దుష్ప్రవర్తనకు పాల్పడ్డారని పేర్కొంది. వైకాపా హయాంలో సీఐడీ విభాగాధిపతిగా చేసి వివాదాస్పదుడిగా ముద్రపడ్డ సునీల్‌కుమార్.. జగన్ జమానాలో ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకోకుండా తరచూ విదేశాల్లో పర్యటించారు. ఒకటి, రెండు సందర్భాల్లో అనుమతి పొందినా, ఆ దేశాలకు కాకుండా వేరే దేశాలకు వెళ్లారు. అమలాపురానికో, భీమవరానికో వెళ్లొచ్చినంత తరచుగా దుబాయ్‌కి రాకపోకలు సాగించారు. ఇవన్నీ అనుమతి లేని పర్యటనలే. జార్జియా వెళ్లేందుకు అనుమతి తీసుకుని... నేరుగా యూఏఈలో వాలిపోయేవారు. అమెరికా వెళ్లేందుకు అనుమతి పొంది యూకేలో పర్యటించారు. 2019 డిసెంబరు నుంచి 2024 మార్చి మధ్య మొత్తం ఆరుసార్లు పీవీ సునీల్‌కుమార్ ఇలా విదేశాల్లో పర్యటించినట్లు కూటమి ప్రభుత్వ విచారణలో తేలింది. ఆయనను సస్పెండ్ చేస్తూ సీఎస్ కె.విజయానంద్ ఆదివారం ఉత్తర్వులు జారీచేశారు. సస్పెన్షన్ కాలంలో సునీల్‌కుమార్ విజయవాడలోనే ఉండాలని, అనుమతి తీసుకోకుండా బయటకు వెళ్లకూడదని పేర్కొన్నారు.

**జాతీయ భద్రతా ప్రయోజనాలకు విఘాతం కలిగించడమే..**

''ఐపీఎస్ అధికారులు వారి హోదా రీత్యా సున్నితమైన ఆపరేషనల్ సమాచారం, నిఘా నివేదికలు, ప్రస్తుతం కొనసాగుతున్న వివిధ కేసుల దర్యాప్తు సమాచారం వంటివి వాళ్లకు అందుబాటులో ఉంటాయి. ఇలాంటి సందర్భాల్లో అనధికారిక విదేశీ పర్యటనలు తీవ్ర ఆందోళన కలిగించే అంశం. ఐపీఎస్ అధికారిగా ఉంటూ అనధికారిక విదేశీ పర్యటనలు చేయడం జాతీయ భద్రతా ప్రయోజనాలకు విఘాతం కలిగించడమే'' అని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. ''ప్రభుత్వం ఆమోదించి అనుమతిచ్చిన ప్రణాళికకు (ట్రావెల్ ప్లాన్) విరుద్ధంగా పీవీ సునీల్‌కుమార్ పర్యటనలు చేశారు. ఐపీఎస్ అధికారులు విదేశాలకు వెళ్లాలంటే ప్రభుత్వ అనుమతి తప్పనిసరి. ఇది పరిపాలనపరమైన పారదర్శకత, భద్రతా సమస్యలను గుర్తించేందుకు అవసరం. కానీ సునీల్‌కుమార్ విదేశీ పర్యటనలకు ముందస్తు అనుమతి తీసుకోలేదు'' అని ప్రభుత్వం ఉత్తర్వుల్లో ప్రస్తావించింది. ఎన్నికలకు కొద్దిరోజుల ముందూ యూఏఈకి గతేడాది మార్చి 16న సార్వత్రిక ఎన్నికల షెడ్యూలు విడుదల కాగా.. మార్చి 1 నుంచి 4 వరకూ సునీల్‌కుమార్ అనుమతి లేకుండానే యూఏఈ వెళ్లారు. 2021 అక్టోబరు నుంచి 2024 మార్చి మధ్య మొత్తం మూడు విడతల్లో 15 రోజుల పాటు యూఏఈలో పర్యటించారు. ఇవన్నీ అనధికారిక పర్యటనలే. హైదరాబాద్ నుంచి స్వీడన్‌కు ఈకే525 నంబరు విమానంలో బయల్దేరి వెళ్లిన సునీల్‌కుమార్ స్వీడన్ నుంచి ఈకే 526 నంబరు విమానంలో తిరిగొచ్చారు. ఈ పర్యటనకు అనుమతిలేదు. అనుమతి లేకుండా 2023 ఫిబ్రవరి 1 నుంచి 28 వరకూ అమెరికాలో పర్యటించారు. సునీల్‌కుమార్.. ఈకే 525 నంబరు విమానంలో వెళ్లి... ఈకే 524 నంబరు విమానంలో వచ్చారు. ప్రభుత్వ అనుమతి లేకుండా 2021 అక్టోబరు 2 నుంచి 8 వరకూ యూఏఈలో పర్యటించిన సునీల్‌కుమార్ ఈకే 525 నంబరు విమానంలో వెళ్లి ఈకే 524 నంబరు విమానంలో తిరిగొచ్చారు.

## సోమనాథుడికి

# మోదీ ప్రత్యేక పూజలు

గిరి సోమనాథ్: గుజరాత్‌లోని గిర్ సోమనాథ్ జిల్లాలో గల ప్రఖ్యాత జ్యోతిర్లింగ క్షేత్రం సోమనాథ్ దేవాలయాన్ని ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సోమనాథ లింగానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పొరుగున గల జునాగఢ్ జిల్లాలోని గిర్ వన్యప్రాణుల అభయారణ్య ప్రధాన కేంద్రం సాసన్‌కు వెళ్లారు. ఈ ప్రాంతం ఆసియా సింహాలకు నెలవై ఉన్న సంగతి తెలిసిందే. సోమవారం ప్రపంచ వన్యప్రాణి దినోత్సవం నేపథ్యంలో సాసన్‌లో జరిగే నేషనల్ బోర్డ్ ఫర్ వైల్డ్‌లైఫ్ సమావేశానికి అధ్యక్షత వహిస్తారు. అలాగే సింహాల సందర్శనకు వెళ్తారు. సోమనాథ్ పర్యటనకు ముందు మోదీ జామ్‌నగర్ జిల్లాలోని జంతు రక్షణ, సంరక్షణ, పునరావాసకేంద్రం వన్‌తారాను సందర్శించారు. ముదు రోజుల పర్యటనలో భాగంగా శనివారం నుంచి మోదీ గుజరాత్‌లో పర్యటిస్తున్నారు. ఇటీవల ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ త్రివేణీ సంగమంలో మహా కుంభమేళా కోట్లాది మంది దేశ ప్రజల భాగస్వామ్యంతో ముగిసినట్లు ప్రధాని 'ఎక్స్'లో పేర్కొన్నారు. ఒక సేవకుడిగా.. మహా కుంభోత్సవం తర్వాత సోమనాథ్ ఆలయానికి వస్తానని అనుకున్నాననీ.. ఇందులో భాగంగానే సోమనాథుడిని దర్శించుకొని తన సంకల్పాన్ని నెరవేర్చుకున్నట్లు తెలిపారు. దేశంలోని ప్రతి ఒక్కరి ఆరోగ్యం, శ్రేయస్సును ఆకాంక్షించినట్లు పేర్కొన్నారు.

# స్ఫూర్తి ప్రదాత స్వర్గీయ దుద్దిల్ల శ్రీపాద రావు

**: జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.**



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో శాసనసభకు వన్నె తెచ్చిన మాజీ స్పీకర్, స్వర్గీయ నేత దుద్దిళ్ళ శ్రీపాదరావు అని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. ఆయన జయంతి సందర్భంగా ఆదివారం ఐ డి ఓ సి కార్యాలయం సమావేశం మందిరం లో ఏర్పాటు చేసిన వేడుకల్లో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ అదనపు కలెక్టర్ డి వేణుగోపాల్ తో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు ఆర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... స్వర్గీయ శ్రీపాద రావు న్యాయవాదిగా ప్రజలకు మంచి సేవలు అందించారని, ఆయన రాజకీయ ప్రస్థానంలో మొదటిగా సర్పంచ్ గా రెండు సార్లు ఎన్నికై తదుపరి మహాదేవపూర్ సమితి అధ్యక్షుడిగా ఎన్నికైయ్యారని చెప్పారు. 1984 ఎన్నికల్లో మొదటి సారి మంథని నుంచి శాసన సభ్యులుగా పోటీ చేసి విజయం సాధించి 3 సార్లు శాసన సభ్యునిగా ఎన్నికైనట్లు తెలిపారు. 1994 లో ఓటమి పాలు అయినప్పటికీ ప్రజల మధ్యనే ఉంటూ ఎన్నో సేవలు అందించడం అలాగే 1999 ఏప్రిల్ 13న మహదేవపూర్ మండలం అన్నారంకు తన అనుచర వర్గంతో వెళ్లి వస్తున్న క్రమంలో మార్గమధ్యంలోని అడవుల్లో ఆయన వాహనాన్ని నక్సల్స్ ఆపివేసి, ఆయనతో మాట్లాడాలని చెప్పి లోపలికి తీసుకెళ్లి కరుకు తుపాకీ తూటాలతో విగత జీవున్ని చేశారు. ఆయన మరణించిన... ఇప్పటికీ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయాడు అని కలెక్టర్ అన్నారు. అధికారులు మహనీయుని గురించి కింది స్థాయి సిబ్బందికి కూడా తెలపాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఓ సంజీవరావు, బీసీ సంక్షేమ అధికారి ఇందిరా, జిల్లా క్రీడా శాఖ అధికారి పరంధామ రెడ్డి, డిఎం సివిల్ సప్లైస్ త్రినాధ్ బాబు , మైనింగ్ శాఖ అధికారి దినేష్ ,వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## జీటెక్స్ ఏషియా, జీటెక్స్ యూరప్ 2025 తో జత కట్టిన టీ కన్సల్ట్




హైదరాబాద్, ప్రజాస్ఫూర్తి : టెక్నాలజీ రంగంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన కార్యక్రమాలు అయిన జీటెక్స్ 2025 లకు టీ కన్సల్ట్ అధికారిక కమ్యూనిటీ భాగస్వామిగా వ్యవహరించనున్నట్లు టీ కన్సల్ట్ ఛైర్మన్ సందీప్ కుమార్ మక్తాల ప్రకటించారు. ఈ భాగస్వామ్యాన్ని పురస్కరించుకుని, టీహబ్ లో జీటెక్స్ 2025 భాగస్వామ్య పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీ టెక్స్ యూరప్ 2025 - యూరప్‌లో అత్యంత ప్రాముఖ్యత కలిగిన టెక్ ఈవెంట్ $3 ట్రిలియన్ టెక్ పరిశ్రమకు కేంద్రబిందువుగా బెర్లిన్ 2500+ ఎగ్జిబిటర్లు, 1000+ స్టార్టప్‌లు పాల్గొననున్నవన్నారు. స్టార్టప్‌లు, ఆవిష్కర్తలు , పెట్టుబడిదారులకు గ్లోబల్ టెక్ లీడర్స్‌తో కలిసే, వారి ఆవిష్కరణలను ప్రదర్శించే , కొత్త మార్కెట్లను అన్వేషించే అరుదైన అవకాశం ఈ ఈవెంట్ల ద్వారా లభిస్తుందన్నారు. జీటెక్స్ ఏషియా 2025 - ఆసియా అతిపెద్ద టెక్ , స్టార్టప్ ఈవెంట్ 1000+ గ్లోబల్ కంపెనీలు & స్టార్టప్‌ల పాల్గొనింపు 120+ దేశాల నుండి 25,000+ టెక్ కొనుగోలుదారులు ఏఐ, సైబర్‌సెక్యూరిటీ, హెల్త్ టెక్, ఫిన్‌టెక్ వంటి విభాగాల్లో విస్తృత అవకాశాలున్నాయన్నారు. ఈ గొప్ప అవకాశాన్ని ఉపయోగించుకోవాలని స్టార్టప్‌లు, ఆవిష్కర్తలు ,పెట్టుబడిదారులకు సూచించారు. ఈవెంట్లలో పాల్గొనాలనుకునే వారు లేదా తమ ఆవిష్కరణలను ప్రదర్శించాలనుకునే వారు టీ కన్సల్ట్ ను 8019577575 ఈ నెంబర్ లో సంప్రదించాలని కోరారు. . ఈ భాగస్వామ్యం టీ కన్సల్ట్ యొక్క గ్లోబల్ టెక్ సహకారాల పెరుగుదలకు, ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్ అభివృద్ధికి ఉద్దేశించిన కట్టుబాటును ప్రతిబింబిస్తుందని తెలిపారు.

## బీసీ నేతను సన్మానించిన కురుమ సంఘం నేతలు



రాజాపేట, ప్రజా స్ఫూర్తి : రెండు దశాబ్దాల అవిశ్రాంత పోరాట యోధుడు బీసీ సంక్షేమ సంఘం నేత జూకంటి ప్రవీణ్ కుమార్ ను మండల కురుమ సంఘం నాయకులు బండి శ్రీనివాస్, పోసుగొండ మధులు పారుపల్లిలోని ఆయన స్వగృహంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సత్కరించారు . ఈ సందర్భంగా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలు అనుసరించాల్సిన వ్యూహంపై సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం బీసీ నేత జూకంటి ప్రవీణ్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీలకతీతంగా బీసీ అభ్యర్థులకు పట్టం కట్టాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. త్వరలోనే స్థానిక ఎన్నికలు బీసీల స్థితిగతులు అనే అంశంపై మండల స్థాయి సమావేశం నిర్వహించి దీనికి బీసీ మేధావులను, కుల సంఘాల నాయకులను, అన్ని రాజకీయపక్షాల నాయకులను ఆహ్వానించనున్నట్లు ఆయన తెలిపారు.

## బియ్యం అందజేసిన స్వాతి చికెన్ సెంటర్ నమిల కేదారి గౌడ్




రాజపేట, ప్రజా స్ఫూర్తి : ఇటీవల రాజపేట గ్రామం బెస్త గూడెంలో మరణించిన గౌటే (బొర్ర)లక్షమయ్య కుటుంబానికి స్వాతి చికెన్ సెంటర్ నేమిలె కేదారీ గౌడ్ ఆదివారం 50 కిలోల బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమం లో మిత్రులు గౌటే రాజు, గౌటే మల్లేష్, గౌటే బాలమల్లయ్య, గౌటే చంద్రయ్య, గౌటే నర్సయ్య, గౌటే బలనర్సయ, గౌటే ఆంజనేయులు, గౌటే బాలరాజు, గౌటే శ్రీను, గౌటే భాస్కర్, గౌటే సాయి, చేరుకు కర్ణకార్ , పిండికూర మహేష్, పిండికూర చింటు, పిండికూర భాను దిడ్డి, అవినాష్ సట్టు, నాని జూపల్లి విజయ్, కుటుంబ సభ్యులు తదితరులు ఉన్నారు.

## ఉనికిని కాపాడుకోవాలని అసత్యపు ప్రచారాలు

* **కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఏళ్ల బాల్ రెడ్డి**
* **మానేరు ఆయకట్టు పొలాలను సందర్శించిన కాంగ్రెస్ నాయకులు**



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్ : రోజు రోజుకు ప్రజల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై పెరుగుతున్న ఆదరణ జీర్ణించుకోలేక, ఉనికిని కాపాడుకోవాలని ప్రతిపక్షాలు అసత్యపు ప్రచారాలకు దిగుతూ బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఏళ్ల బాల్ రెడ్డి అన్నారు. మానేరు ఆయకట్టు పొలాలను కాంగ్రెస్ ముస్తాబాద్ మండల నాయకులు ఆదివారం సందర్శించి, పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్తాబాద్ మండలంలోని ప్రతి ఎకరాకు ఆయకట్టు నుండి వచ్చే నీటిని ప్రభుత్వం అందిస్తుందని, అసత్య ప్రచారాలు చేస్తూ ఓ నలుగురైదుగురు రైతులను వెంబడి వేసుకొని బిఆర్ఎస్ నాయకులు ప్రెస్ మీట్‌లు పెట్టడం వారి విజ్ఞతకే వదిలేస్తున్నామని అన్నారు. రైతులు ఆయకట్టు ప్రాంతం దగ్గర కాకుండా బోరుబావుల మీద ఆధారపడి ఉన్న రైతులు భూగర్భ జలాలు అడుగంటి ఎక్కడో కొన్ని పొలాలు ఎండిపోతే దానిని భూతద్దంలో చూపెడుతూ కాంగ్రెస్‌పై అసత్య ప్రచారాలు చేస్తున్నారని అన్నారు. రాజన్న సిరిసిల్ల నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యే కెటిఆర్ వారంలో రెండు రోజులు ఇక్కడే ఉంటా మీ యోగక్షేమాలు చూసుకుంటానని చెప్పి ప్రగల్భాలు పలికి కనీసం నియోజకవర్గం వైపు నెలకోసారి కూడా కన్నెతి చూడటం లేదని అన్నారు. ఎమ్మెల్యే హరీష్ రావు రంగనాయక సాగర్ లాంటి ఎన్నో కాలువలు తవ్వించి చెరువులు నింపుకుంటే సిరిసిల్లకు గుండెకాయ అయినటువంటి మానేరులో తట్టెడు మట్టిని తీయలేని పరిస్థితిలో కెటిఆర్ ఉన్నారని విమర్శించారు. ఏ పదవి ఉన్నా లేకున్నా సిరిసిల్ల నియోజకవర్గం అభివృద్ధి పథంలో ఉండేందుకు, రైతులు సుభిక్షంగా ఉండాలని నిరంతరం ప్రజలతో మమేకమవుతూ కాంగ్రెస్ సిరిసిల్ల నియోజక వర్గ ఇన్‌ఛార్జి కెకె మహేందర్ రెడ్డి ఎంతగానో కృషి చేస్తున్నారని, ఇప్పటికైనా అసత్య ప్రచారాలు మానుకోకపోతే చర్యకు ప్రతి చర్యలు కూడా ఉంటాయని బిఆర్ఎస్ నాయకులను హెచ్చరించారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు గజ్జల రాజు, ఎఎంసి చైర్మన్ అన్నం రాజేందర్ రెడ్డి, వేముల సత్తన్న, రంజాన్ నరేష్, శీల ప్రశాంత్, ఉచ్చిడి బాల్రెడ్డి, మట్ట రమణారెడ్డి, ఎద్దెంది మహేందర్, మామిళ్ల శ్రీకాంత్, వెంకట్రావుపల్లి రాజిరెడ్డి, తలారి నర్సింలు, ఆంజనేయులు, రాం రెడ్డి, రమేష్ తదితరులున్నారు.

## క్రీడలు మానసిక ఉల్లాసానికి శారీరక ధృఢత్వానికి దోహదం

* **మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్**



మేడ్చల్, (ప్రజాస్ఫూర్తి) : క్రీడలు మానసిక ఉల్లాసానికి శారీరక ధృఢత్వానికి ఎంతగానో దోహదపడుతుందని మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జ్ తోటకూర వజ్రెష్ యాదవ్ అన్నారు. మేడ్చల్ నియోజకవర్గం లోని పోచారం మున్సిపాలిటీ కాచివాన్ సింగారం ఆల్వ క్రికెట్ గ్రౌండ్ లో పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ మహిళా అధ్యక్షురాలు శ్రీలత భద్ర నాయక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్ లో ఆయన పాల్గొని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు అధ్యక్షులు తుంగతుర్తి రవి, పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ శివ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి ని సన్మానించిన ముస్లీం సోదరులు



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : రంజాన్ నెల ప్రారంభమైన సందర్భంగా నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రాజీవ్ గృహకల్ప ముస్లిం సోదరులు ఆదివారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి ని మర్యాద పూర్వకంగా కలిసి శాలువా తో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌస్, పంగా శ్రీనివాసరావు,కుమార్ యాదవ్, ఎం శ్రీనివాస్, సుధాకర్, దామోదర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలంటే కృషి, పట్టుదల అవసరం

* **బీఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్**







కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : విద్యార్థులు అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలంటే కృషి, పట్టుదల అవసరమని బీఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ అన్నారు. శనివారం రాత్రి కుత్బుల్లాపూర్ డివిజన్ బాపునగర్ లోని ఆర్.ఎస్.కె. హైస్కూల్ నందు నిర్వహించిన వార్షికోత్సవ వేడుకలలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల బంగారు భవిష్యత్తు రూపకల్పనలో ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రుల కృషి అత్యంత కీలకమన్నారు. విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాలలో రాణించాలన్నారు. కష్టపడి చదివే ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలలదిరోహించడం ఖాయమన్నారు. తెలంగాణ రాష్ట్ర ట్రస్మా అసోసియేట్ అధ్యక్షులు , పాఠశాల కరస్పాండెంట్ కె.రామేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే విద్యార్థులకు మెరుగైన విద్యను అందిస్తున్నామన్నారు. ప్రతి విద్యార్థి పై వ్యక్తిగత శ్రద్ధ తీసుకుంటూ విద్యతోపాటు,క్రీడలు సామాజిక విలువల గూర్చి తెలుపుతూ వారి ఉజ్వల భవితకు పునాదులు వేస్తున్నామన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలతో ఆహుతులను అలరింపజేశారు.ఈ కార్యక్రమంలో ట్రస్మా జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి, వివిధ పాఠశాలల కరస్పాండెంట్స్ బిర్రు అంజనేయులు, వినోద్ జాదవ్ , దయాకర్, సి.హెచ్.నర్సింహులు గౌడ్,టీయూడబ్ల్యూజే (ఐజేయూ) మేడ్చల్ జిల్లా అధ్యక్షులు గడ్డమీది బాలరాజు, డివిజన్ ప్రధాన కార్యదర్శి సత్తిరెడ్డి, సీనియర్ నాయకులు కిషోర్ చారి, కాలనీవాసులు ప్రభాకర్ రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడిన సందీప్ మాదాల ను పరామర్శించిన కొలన్ శ్రీనివాసరెడ్డి



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : ఇటీవల రోడ్డు ప్రమాదం జరిగి కాలుకి ఆపరేషన్ చేయించుకున్న కొలన్ తులసీ రెడ్డి (కేటీఆర్) కాలనీ కి చెందిన సందీప్ మాదాల ను ఆదివారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాసరెడ్డి ఆయన నివాసానికి వెళ్ళి పరామర్శించారు. అనంతరం ఆపరేషన్ వివరాలు అడిగి తెల్సుకుని ధైర్యంగా ఉండాలన్నారు. అనుకోకుండా మన ప్రమేయం లేవకుండా కూడా రోడ్డు ప్రమాదాలు జరుగుతాయని త్వరగా కోలుకుంటారని ధైర్యం చెప్పారు. ఆయనను పరామర్శించిన వారిలో కాలనీ వాసులు ఏలూరి సత్య (నాని),పంగా శ్రీనివాసరావు, కోయన రామకృష్ణ,కోడూరి వెంకట్ ,శుధీర్ వర్మ,అల్లూరి రాజు,రేణుబాబు,వేమూరి నాగరాజు,రాఘవ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కార్పొరేటర్ జూపల్లి జన్మదిన వేడుకలు



కూకట్ పల్లి ,(ప్రజాస్ఫూర్తి) : కూకట్ పల్లి డివిజన్ కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణరావు జన్మదిన వేడుకలను ఆదివారం బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు , అభిమానుల మధ్య ఘనంగా నిర్వహించారు. కూకట్ పల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ కోఆర్డినేటర్ ఆర్. సతీష్ అరోరా, దీనబంధు కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.మహేందర్ నాయక్ ప్రభృతులు జూపల్లిని నివాసం వద్ద మర్యాదపూర్వకంగా కలిసి ఆయనకు పుష్పగుచ్చం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మహేందర్ నాయక్ మాట్లాడుతూ కార్పొరేటర్ జూపల్లి ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ డివిజన్ ను అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తున్నారని కితాబిచ్చారు. అంతకు ముందు కూకట్ పల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ కె.నవీన్ కుమార్ ప్రభృతులతో పాటు పలువురు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, శ్రేయోభిలాషులు జూపల్లిని కలసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఆరోగ్య వంతమైన తెలంగాణ నిర్మాణానికి ఆరోగ్యరన్ 2025 తోడ్పడుతుంది

*** పీర్జాదిగూడ మున్సిపల్ కార్పోరేషన్ మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి**




మేడిపల్లి, (ప్రజాస్ఫూర్తి) : ఆరోగ్య వంతమైన తెలంగాణ నిర్మాణానికి రాచకొండ రన్నర్స్" ఆధ్వర్యంలో నిర్వహించిన "ఆరోగ్యరన్ 2025" ఈవెంట్ తోడ్పడుతుందని పీర్జాదిగూడ మున్సిపల్ కార్పోరేషన్ మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి అన్నారు. ఇలాంటి కార్యక్రమాల వలన ప్రజలకు ఆరోగ్యంపై అవగహన కలుగుతుందన్నారు. ఏవీ కన్ స్ట్రక్షన్, ది ఆనంద ఇన్ఫినిటి జాయ్, విజయరత్న స్కూల్, సహస్రం డెవలపర్స్ వారి సౌజన్యంతో నారపల్లి లోని భాగ్యనగర నందనవనం రిజర్వు ఫారెస్ట్ లో ఆదివారం "రాచకొండ రన్నర్స్" ఆధ్వర్యంలో నిర్వహించిన "ఆరోగ్యరన్ 2025" ఈవెంట్స్ ను మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించి 2కె, 5కె, 10కె రన్ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచిన రన్నర్స్ కు మెడల్స్ ను బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాచకొండ రన్నర్స్ సంస్థ ప్రతినిధులు ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్న ఇలాంటి కార్యక్రమాలలో మహిళలు, వృద్ధులు, చిన్నారులు, యువత పాల్గొనడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో పీర్జాదిగూడ మున్సిపల్ కార్పోరేషన్ మాజీ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి, రాచకొండ రన్ నిర్వాహకులు ప్రభాకర్, బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ ఎడవెల్లి రఘువర్ధన్ రెడ్డి, బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు నిర్మల, జవేద్ ఖాన్ గారు నర్సింహా, శ్యామల నర్సింహా, కిరణ్ నాయక్, రమేష్, శంకర్ రావు, మామిడి శ్రీధర్, ఆరోగ్య రన్ స్పాన్సర్స్ తో పాటు సుమారు 800 మంది పాల్గొన్నారు.

# కాసాని సంస్మరణ సభ పోస్టర్ ఆవిష్కరణ




ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: సిపిఎం రాష్ట్ర నేత కాసాని ఐలయ్య సంస్కరణ సభకు సిపిఎం జాతీయ రాష్ట్ర నాయకత్వం సుజాతనగర్ రానున్నదని సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు తెలిపారు. మార్చి 9న జరగనున్న కాసాని సంస్కరణ సభ పోస్టర్ను స్థానిక మంచి కంటి భవన్లో ఆవిష్కరించారు ఈ సందర్భంగా మచ్చ మాట్లాడుతూ కాసాని సంస్మరణ సభకు జిల్లావ్యాప్తంగా సన్నాహాలు చేస్తున్నట్లు గ్రామ గ్రామాన జనరల్ బాడీ సమావేశాలు ఏర్పాటు చేసి మార్చి 9 సుజాతనగర్ సభకు వేలాదిగా ప్రజలను సమీకరించి సభ నిర్వహించనున్నట్లు తెలియజేశారు. కాసాని పోరాటం స్మృతులను ఆయన స్ఫూర్తిని నేటి తరానికి అందించడానికి కాసానిస్ఫూర్తితో భవిష్యత్తు పోరాటాలకు సిద్ధం అవ్వడానికి ఈ సభను ఉపయోగించనున్నట్లు ఆయన తెలియజేశారు అందుకని కాసాని తోపాటు ఉద్యమంలో పనిచేసిన నాయకులను ఇతర రాజకీయ పార్టీల నాయకులను కూడా ఆహ్వానించి ఘనంగా కాసాని ఐలయ్యకు నివాళులు అర్పించనున్నట్లు తెలియజేశారు ఈ సభకు సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం బి వెంకట్ సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ మరియు ఇతర రాష్ట్ర నాయకత్వం ఉమ్మడి ఖమ్మం జిల్లా నాయకత్వం పార్టీ శ్రేణులు ఈ సభలో పాల్గొననున్నట్లు తెలియజేశారు. కాసాని స్ఫూర్తితో పేదల సమస్యలపై భవిష్యత్ పోరాటాలను నిర్వహిస్తామని అందుకు ప్రజలను సన్నద్ధం చేస్తామని కాసాని పోరాటాలు చిరస్థాయిగా నిలిచే విధంగా ప్రజలకు వివరించే ప్రయత్నం చేస్తామని తెలియజేశారు. కాసాని స్ఫూర్తితో ప్రజా పోరాటాలతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలు కూడా నిర్వహించి కాసాని స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్తామని తెలియజేశారు. మార్చి 9న సుజాతనగర్ లో జరిగే సంస్మరణ సభకు అన్ని వర్గాల ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు లిక్కి బాలరాజు, రేపాకుల శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు కొండపల్లి శ్రీధర్, దొడ్డ రవి, జి పద్మ, భూక్య రమేష్ ,యాస నరేష్ ,తులసిరాం, సందకూరు లక్ష్మి, సత్య, ఉపేష్ ,తదితరులు పాల్గొన్నారు.

# 2540 సంవత్సరాల యువతలో ఆస్టియో ఆర్థరైటిస్ పెరుగుతుంది

*** డాక్టర్ బాలాజీ పటేల్ కోలా**



హైదరాబాద్, ప్రజాస్ఫూర్తి : ఒకప్పుడు వృద్ధుల పరిస్థితిగా భావించే ఆస్టియో ఆర్థరైటిస్ ఇప్పుడు 2540 ఏళ్ల మధ్య వయస్కులపై ఎక్కువగా ప్రభావం చూపుతుందని మావెన్ మెడికల్ సెంటర్ సీనియర్ ఇంటర్వెన్షనల్ రేడియాలజిస్ట్ డాక్టర్ బాలాజీ పటేల్ కోలా అన్నారు. ఎముకల చివరలను కుషన్ చేసే రక్షిత మృదులాస్థి కాలక్రమేణా క్షీణించినప్పుడు సంభవించే పరిస్థితి ఇది ఆస్టియో ఆర్థరైటిస్ ఏదైనా ఉమ్మడిని దెబ్బతీసినప్పటికీ ఇది ఎక్కువగా చేతులు, మోకాలు, తుంటి, వెన్నెముకలోని కీళ్ళను ప్రభావితం చేస్తుందన్నారు.నిశ్చల జీవనశైలి ఈ ప్రమాదకర ధోరణికి ప్రధాన కారణమని డాక్టర్ బాలాజీ పటేల్ కోలా పేర్కొన్నారు. ఎక్కువసేపు కూర్చోవడం,పేలవమైన భంగిమ, శారీరక శ్రమ లేకపోవడం వంటి నిశ్చల ఉద్యోగాలు ప్రారంభ ఆస్టియో ఆర్థరైటిస్ కు ప్రధాన దోహదం చేస్తాయన్నారు. స్థూలకాయం, అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, అధిక తీవ్రత కలిగిన క్రీడలు, శారీరకంగా డిమాండ్ చేసే పని నుండి పునరావృతమయ్యే ఉమ్మడి ఒత్తిడి వంటి అంశాలు ఉమ్మడి క్షీణతను వేగవంతం చేస్తాయన్నారు. మానసిక ఒత్తిడి కూడా శరీరంలో మంటను ప్రేరేపించడం ద్వారా పాత్ర పోషిస్తుందని చెప్పారు.

# నిరు పేదలకు అతి తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్యం అందించడమే ఆసుపత్రి ప్రధాన లక్ష్యం

*** ప్రముఖ రేఖీ థెరపీ గ్రాండ్ మాస్టర్ లక్ష్మి కమలాకర్**





కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : నిరు పేదలకు అతి తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్యం అందించడమే ఆసుపత్రి ప్రధాన లక్ష్యమని ప్రముఖ రేఖీ థెరపీ గ్రాండ్ మాస్టర్ లక్ష్మి కమలాకర్ అన్నారు. కూకట్ పల్లి వివేకానంద నగర్ లోని రాందేవ్ రావు ఆసుపత్రిలో ఆదివారం నిర్వహించిన ఉచిత డెర్మాటలజీ ఈఎన్ టీ మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించినందుకు తమకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. అతి తక్కువ వైద్య ఖర్చులతో సమాజానికి సేవ అందిస్తున్న రాందేవ్ రావ్ ఆసుపత్రి యాజమాన్యానికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. సమాజంలోని నిరుపేదలకు అతి తక్కువ ఖర్చులతో నాణ్యమైన వైద్య సేవలు అందించడం అభినందనీయమన్నారు. ఆసుపత్రి మెడికల్ డైరెక్టర్ కమలాకర్ మాట్లాడుతూ స్థానికుల అభ్యర్థన మేరకు ఆసుపత్రిలోని మరిన్ని విభాగాలతో ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ఆసుపత్రి సీఈవో డాక్టర్ యోబు మాట్లాడుతూ నిరుపేదలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించడంలో రాందేవ్ రావు ఆసుపత్రి ఎప్పుడు ముందుంటుందన్నారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో సుమారు 500 మంది రోగులు పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారన్నారు. ఈ వైద్య శిబిరంలో చెవి నొప్పి, వినికిడి సమస్య, చెవి నుంచి ద్రవం విడుదల, తల తిరగడం, ముక్కు మూసుకుపోవడం, ముక్కు నుండి రక్తం కారుట, ముక్కు నొప్పి, గొంతు నొప్పి, దగ్గు, చేదు శ్వాస, అలర్జీలకు వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈఎన్ టి సర్జన్స్ డాక్టర్.శ్వేత, డాక్టర్ లావణ్యలు ఈ వైద్య శిభిరాన్నిపర్యవేక్షించారన్నారు. డాక్టర్ల సలహామేరకు అవసరమైన వారికి సిటి స్కాన్ వేయి రూపాయలకు, ఎంఆర్ఐ స్కాన్ రూ.2 వేలకే చేయడం జరిగిందన్నారు. ఈ వైద్య పరీక్షలతో పాటు మొటిమలు, బొల్లి మచ్చలు, మంగు మచ్చలు, గజ్జి, తామర, ఇతర మచ్చలు, దురదలు, దద్దుర్లు,అలర్జీలు, జుట్టు రాలడం, బట్ట తల, చుండ్రు, పేను కొరకడం, గోరుచుట్టు ఇన్ఫెక్షన్ లకు కూడా పరీక్షలు చేయడం జరిగిందన్నారు. డాక్టర్లు సి.స్వాతి, డాక్టర్. కె. శ్రీహర్ష ల పర్యవేక్షణలో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. డాక్టర్ల సలహా మేరకు రోగులకు సిబిపి, ఏఈసి, ఐజిఈ, ఎనిమియా ప్రొఫైల్, పిటీఏ, ఐ ఎం పి, ఓఏఈ వైద్య పరీక్షలను ఉచితంగా చేశామన్నారు. వినికిడి పరికరాల కొనుగోలు చేసే రోగులకు ప్రత్యేక రాయితీ ఇస్తున్నట్లు ఆయన తెలియజేశారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న డిఎంఓ లకు, అడ్మిన్ మేనేజర్లకు, పారా మెడికల్ సిబ్బందిని ఆయన అభినందించారు. ఈ ఉచిత వైద్య శిబిరాన్ని విజయవంతం కావడానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి ఆయన ధన్యవాదాలు తెలిపారు.

# హాల్ టికెట్ పేరిట దోపిడీ – ప్రైవేట్ కళాశాలల అక్రమాలపై కఠిన చర్యలు తీసుకోవాలి

*** పి డి ఎస్ యు జిల్లా ప్రధాన కార్యదర్శి జె.గణేష్ డిమాండ్**




ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: హాల్ టికెట్ విద్యార్థుల దగ్గర దోపిడి కి పాల్పడుతున్న కళాశాలలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని పి డి ఎస్ యు ఆధ్వర్యంలో ఇల్లందు ఐ ఎఫ్ పి యు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పి డి ఎస్ యు జిల్లా ప్రధాన కార్యదర్శి గణేష్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును తాకట్టుపెట్టేలా కొన్ని ప్రైవేట్ కళాశాలలు వ్యవహరిస్తున్న తీరు భయానకంగా మారుతోంది. ముఖ్యంగా పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని, ఉచిత విద్య పేరుతో మోసపూరిత వ్యూహాలు రచిస్తున్న కళాశాల యాజమాన్యాలు, పరీక్ష సమయం వచ్చినప్పుడు అక్రమంగా డబ్బులు వసూలు చేస్తూ, విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నాయని పి డి ఎస్ యు జిల్లా ప్రధాన కార్యదర్శి జె.గణేష్ మండిపడ్డారు.

**"ఫ్రీ ఎడ్యుకేషన్" పేరుతో విద్యార్థులను మోసం**

పదవ తరగతి పూర్తి చేసిన విద్యార్థుల వద్దకు ప్రైవేట్ కళాశాల ప్రతినిధులు వెళ్లి, "ప్రభుత్వ పాఠశాలల తరహాలో ఉచిత విద్య" అందిస్తామని ఆశ చూపిస్తూ, వారి ఆధార్ కార్డు, ఫోన్ నంబర్, ఓటీపీ తీసుకుని అడ్మిషన్లు నమోదుచేసుకుంటున్నారు. ఈ ప్రక్రియ ద్వారా, ప్రభుత్వ రీయింబర్స్‌మెంట్ పొందేందుకు కళాశాలలు మార్గం సుగమం చేసుకుంటున్నాయి. అయితే, అసలు ఆట మొదలయ్యేది పరీక్ష సమయం దగ్గరపడిన తర్వాతే. అప్పటివరకు ఉచిత విద్య ఇచ్చినట్లు నటించిన కళాశాల యాజమాన్యాలు, పరీక్ష సమయానికి హాల్ టికెట్ ఫీజు చెల్లించాలని ఒత్తిడి మొదలు పెడతాయి. "మీరు ఫీజు కట్టకపోతే హాల్ టికెట్ రాదు", "ఫీజు కడితేనే మీకు హాల్ టికెట్ అందజేస్తాం" అంటూ బెదిరింపులకు దిగుతాయి. దీనివల్ల పేద విద్యార్థులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని పి డి ఎస్ యు జిల్లా ప్రధాన కార్యదర్శి జె.గణేష్ ఆవేదన వ్యక్తం చేశారు.

**హాల్ టికెట్ పేరిట అక్రమ దోపిడీ – విద్యార్థుల హక్కులకు ముప్పు**

ఈ అక్రమాలను ఖండించిన పి డి ఎస్ యు జిల్లా ప్రధాన కార్యదర్శి జె.గణేష్ "విద్యార్థుల హక్కులను కాలరాస్తూ ప్రైవేట్ కళాశాల యజమానులు అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్న తీరు తీవ్రంగా ఖండించదగినది. విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేసే విధంగా వ్యవహరిస్తున్న ఈ దోపిడీని తక్షణమే అరికట్టాలి" అని డిమాండ్ చేశారు. ప్రైవేట్ కళాశాలల అక్రమాలపై తక్షణమే ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు జోక్యం చేసుకోవాలని, లేకపోతే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని, విద్యా శాఖ కార్యాలయాల ముట్టడి సహా తీవ్ర ఆందోళనలు నిర్వహిస్తామని పి డి ఎస్ యు జిల్లా ప్రధాన కార్యదర్శి జె.గణేష్ హెచ్చరించారు.ప్రభుత్వం తక్షణమే స్పందించకపోతే, జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున విద్యార్థుల తో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని పి డి ఎస్ యు జిల్లా ప్రధాన కార్యదర్శి జె.గణేష్ హెచ్చరించారు.

**విద్యార్థుల భవిష్యత్తు కోసం – ప్రభుత్వమే ముందుకు రావాలి!**

ప్రభుత్వం ఈ అంశాన్ని తక్షణమే ప్రాధాన్యతగా తీసుకుని, ప్రైవేట్ కళాశాలల అక్రమాలను అరికట్టేందుకు కఠిన చట్టాలను అమలు చేయాలి. విద్య అనేది లాభాల కోసం చేయాల్సిన వ్యాపారం కాదు, ఇది ప్రాథమిక హక్కు! విద్యార్థుల హక్కులను కాపాడే బాధ్యత ప్రభుత్వంపై ఉందని పి డి ఎస్ యు జిల్లా ప్రధాన కార్యదర్శి జె.గణేష్ అన్నారు. తక్షణమే విద్యార్థుల దగ్గర తీసుకున్న డబ్బులను విద్యార్థులకు ఇప్పించాలి డిమాండ్ చేశారు. విద్యార్థులకు ఎటువంటి భయభ్రాంతులకు గురి చేయొద్దని డిమాండ్ చేశారు. ఎగ్జామ్ సెంటర్లో విద్యార్థులకు మౌలిక సదుపాయాలను కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో. ఏ.సాయి. జి. సంజీవ్. ఎం సాయి. సంతోష్. బి. కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు భావితరాలకు దిక్సూచిగా నిలవాలి

*** బిఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్**





జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : విద్యార్థులు భావితరాలకు దిక్సూచిగా నిలవాలని బిఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ అన్నారు. జగద్గిరిగుట్ట డివిజన్ బీరప్ప నగర్ లోని స్వాతి విద్యానికేతన్ హై స్కూల్ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు, సాంస్కృతిక కలల నందు ప్రోత్సహించినట్లయితే వారి భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందన్నారు. విద్యార్థులు అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలంటే కృషి, పట్టుదల అవసరమన్నారు. అనంతరం చిన్నారులు పలు సాంస్కృతిక కార్యక్రమాలతో ఆహుతులను అలరింపజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కొలుకుల జగన్, హేమలత సురేష్ రెడ్డి, మేడ్చల్ జిల్లా ఫిషరీస్ కోఆపరేటివ్ చైర్మన్ మన్నె రాజు, శ్రీ వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మజ్జి శ్రీనివాస్, నాయకులు రేగూరి ప్రవీణ్ గుప్తా, శశి, పాఠశాల అకాడమిక్ డైరెక్టర్ బిసమత్తిని నవీన్, ప్రిన్సిపల్ చైతన్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మానవ హక్కుల కమిషన్ జిల్లా అధ్యక్షునికి ఘన సన్మానం



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్ : అంతర్జాతీయ మానవ హక్కుల కమిషన్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులుగా నూతనంగా నియమితులైన ఎండి. జహంగీర్‌ను ఆదివారం ఘనంగా సన్మానించారు. మాజీ జడ్పిటిసి సభ్యులు మట్ట వెంకటేశ్వర్ రెడ్డి, కేటీఆర్ సేన రాష్ట్ర అధ్యక్షులు మెంగని మనోహర్ మానవ హక్కుల కమిషన్ జిల్లా అధ్యక్షుడు ఎండి. జహంగీర్‌కు శాలువా కప్పి, పూలమాలలు వేసి సన్మానించి, అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ జెల్ల వెంకటస్వామి, జాతీయ బీసీ సంక్షేమ సంఘం యూత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీలం స్వామి, నాయకులు ఏళ్ల రామ్ రెడ్డి, దమ్మ రవీందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సురోజుల నరేంద్ర చారి తదితరులున్నారు.

# యువత స్వశక్తితో ఉన్నత స్థాయికి ఎదగాలి

**- మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: యువత స్వయం ఉపాధి ద్వారా స్వశక్తితో ఉన్నత స్థాయికి ఎదగాలని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం వలిగొండ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన చౌటుప్పల్ మోటార్స్ సేల్స్ అండ్ సర్వీసింగ్ సెంటర్ ను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ యువత తల్లిదండ్రులపై ఆధారపడకుండా, వ్యాపార మార్గాలను ఎంచుకోవాలన్నారు. నిబద్ధతతో వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించాలని సూచించారు. చౌటుప్పల్ మోటార్స్ సేల్స్ అండ్ సర్వీసింగ్ సెంటర్ నిర్వాహకుడు మేడి నరేష్‌ను అభినందించారు. నరేష్ వ్యాపారంలో యువతకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మునుగోడు నియోజకవర్గం ఎన్నికల సమన్వయకర్త పబ్బు రాజు గౌడ్, చౌటుప్పల్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆకుల ఇంద్రసేనారెడ్డి, కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు సుర్వి నర్సింహ్మా గౌడ్, మాజీ బ్లాక్ అధ్యక్షుడు గుండు మల్లయ్య గౌడ్, మాజీ మున్సిపల్ అధ్యక్షుడు మొగుదాల రమేష్ గౌడ్, తాజా మాజీ కౌన్సిలర్లు కొరగోని లింగస్వామి, బండమీది మల్లేష్, కొయ్యడ సైదులు గౌడ్, కాసర్ల శ్రీనివాస్ రెడ్డి, సందగళ్ళ సతీష్ గౌడ్, బాబా షరీఫ్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాచకొండ భార్గవ్, మాజీ అధ్యక్షుడు మాదగోని శేఖర్ గౌడ్, ఊడుగు శ్రీనివాస్ గౌడ్, ఎండీ హన్ను బాయి, నేలపట్ల గ్రామ శాఖ అధ్యక్షుడు పాలమాకుల నరసింహా, మాచర్ల సంతోష్, వీరమళ్ళ సత్తయ్య, చింతల సాయిలు, సిలివేరు శ్రీశైలం, సిలివేరు నర్సింహ్మా, మలిగే మల్లేశం, రావుల స్వామి, దేప రాజు, నిర్వాహకుడు మేడి నరేష్, గుండు రాజు, గుండు దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

## నేటి తరానికి సీనియర్ సిటిజన్స్ మార్గదర్శకులుగా ఉండాలి

*** బిఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్**



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : నేటి తరానికి సీనియర్ సిటిజన్స్ మార్గదర్శకులుగా ఉండాలని బిఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అన్నారు. జీడిమెట్ల డివిజన్ వేంకటేశ్వర కాలనీ వెస్ట్ నందు సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వారు ఆదివారం నిర్వహించిన సమావేశానికి బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి, చెడులను తెలియజేస్తూ వారికి సన్మార్గాన్ని చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుంట సిద్దిరాములు, సుధాకర్ గౌడ్, ఎల్లా గౌడ్, జ్ఞానేశ్వర్ ముదిరాజ్, విజయ్ హరీష్, సీనియర్ సిటిజన్స్ సభ్యులు సమ్మయ్య, శంకరయ్య, రామ్ చందర్, రాజ్ కుమార్, ఆంజనేయులు, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

## రాజకీయాలలో పదవులు ముఖ్యం కాదు

*** బిఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్**



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి ) : రాజకీయాలలో పదవులు ముఖ్యం కాదని బిఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అన్నారు. ఆదివారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్ ఆధ్వర్యంలో మాజీ బిఆర్ఎస్ కార్పొరేటర్లు, కోఆప్షన్స్ సభ్యుల కుటుంబ సభ్యులతో నిర్వహించిన "ఆత్మీయ సమ్మేళన" కార్యక్రమానికి బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సంధర్భంగా బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ పదవులు ఉన్నా లేకున్నా ప్రజల సంక్షేమం కోసం పనిచేసే వారే నిజమైన నాయకులన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలి

*** బీజేపీ నేత ఆకుల సతీష్**




జగద్గిరిగుట్ట , (ప్రజాస్ఫూర్తి) : ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని బీజేపీ నేత ఆకుల సతీష్ అన్నారు. నూతన బస్ డిపో నిర్మాణానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదివారం జగద్గిరిగుట్ట బస్ స్టాండ్ లో ఆకుల సతీష్ టీం , జగద్గిరిగుట్ట బస్ డిపో సాధన సమితి ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆకుల సతీష్ మాట్లాడుతూ జగద్గిరిగుట్ట ప్రాంతంలో పాత బస్ డిపో స్థితిగతులు దయనీయంగా మారాయన్నారు. బస్సులను పార్కింగ్ చేసేందుకు తగిన స్థలం లేకపోవడంతో పాటు, రాత్రిపూట వివిధ జిల్లాల నుండి వచ్చే సుమారు 40 బస్సులకు పార్కింగ్ కష్టతరంగా మారిందన్నారు. ఉదయం, సాయంత్రం పీక్ అవర్స్ లో బస్టాండ్ ప్రాంతంలో తీవ్రమైన ట్రాఫిక్ సమస్యల కారణంగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. దశాబ్ద కాలంగా స్థానిక ప్రజలు హెచ్ఎంటీ స్థలంలో కొత్త బస్ డిపో నిర్మించాలని నిరంతరం డిమాండ్ చేస్తున్నామన్నారు. 2017 ఎంపీ ఎన్నికల సమయంలో అప్పటి మంత్రి కేటీఆర్ , స్థానిక ఎమ్మెల్యే వివేకానంద కొత్త డిపో ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ, దాన్ని అమలు చేయకపోవడం పట్ల ప్రజలు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. నూతన బస్ డిపో నిర్మాణానికి సంబంధించి ఇప్పటికైనా ప్రస్తుత ప్రభుత్వం తక్షణ నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందన్నారు. మినీ తెలంగాణగా పేరొందిన జగద్గిరిగుట్టకు 10 ఎకరాల్లో నూతన బస్ డిపో నిర్మించి ప్రజలకు వాహన సౌకర్యాన్ని అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో నల్ల జై శంకర్ గౌడ్, ఆంజనేయులు, అమలేశ్వరి, శ్రీనివాస్ గౌడ్, అరుణ్ రావు, సుభాష్, లానా, విశాల్, పనింద్ర, సంతోష్, శివ గౌడ్, ఈశ్వర్ రెడ్డి, మురళి తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి నిర్మూలనకు ప్రజలు సహకరించాలి

- **అంతరాష్ట్ర గంజాయి పెడ్లర్ అరెస్ట్**
- **నెంబర్ ప్లేట్లు మారుస్తూ గంజాయి సరఫరా, మాటు వేసి పట్టుకున్న పోలీసులు**
- **102కిలోల గంజాయి, 1కారు, 2సెల్ ఫోన్ లు స్వాధీన, పరారిలో మరో ఇద్దరు నిందితులు**
- **డీసీపీ రాజేష్ చంద్ర**












చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి ఇతర రాష్ట్రాలకు గంజాయి సరఫరా చేసే అంతరాష్ట్ర గంజాయి పెడ్లర్ ను శనివారం సాయంత్రం చౌటుప్పల్ పోలీసులు పట్టుకున్నారు. చౌటుప్పల్ పోలీస్ స్టేషన్ లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో భువనగిరి డీసీపీ రాజేష్ చంద్ర కేసు వివరాలు వెల్లడించారు. మహారాష్ట్ర నాందేడ్ జిల్లాకు చెందిన నకుల్ కైలాష్ గైక్వాడ్ తన స్నేహితుడు ప్రమోద్, సచిన్ లతో కలిసి గత 5ఏళ్లుగా అక్రమంగా గంజాయి సరఫరా చేస్తున్నాడు. ఈ క్రమంలో ఇటీవల వారి మధ్య తగాదాలు నెలకొనడంతో, నకుల్ కైలాష్ గైక్వాడ్ ఉత్తరప్రదేశ్ కు చెందిన సేటు అనే వ్యక్తితో చేతులు కలిపి గంజాయి సరఫరా చేసేందుకు ఒప్పందం కుదురుచుకున్నాడు. ఈ నేపథ్యంలో సేటు తన కారు, రూ. 32వేలు నగదును నకుల్ కైలాష్ గైక్వాడ్ గంజాయి సరఫరా చేయాలిసిందిగా కోరాడు. ఈ మేరకు అల్లూరి సీతారామ జిల్లాకు చెందిన వీరబాబు అనే మరో డ్రగ్ పెడ్లర్ సహాయంతో నకుల్ కైలాష్ గైక్వాడ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనకాపల్లి జిల్లా కన్నూర్ నుంచి సుమారు 102కిలోల గంజాయిని 51ప్యాకెట్ లు గా పార్సెల్ చేసి చౌటుప్పల్ మీదుగా మహారాష్ట్ర కు తరలించేందుకు వ్యూహం రచించారు.

*** కారు నెంబర్ ప్లేట్లను మారుస్తూ రవాణా**

అఖిల్ కైలాస్ గైక్వాడ్ గంజాయి అక్రమ రవాణాలో ఆరితేరి పోవడంతో, తన తెలివిని ఉపయోగించి ఎక్కడా కూడా పోలీసుల కంటపడకుండా ఉండేందుకు కారు నెంబర్ ప్లేట్లను మారుస్తూ గంజాయి రవాణా చేస్తున్నాడు. ఎప్పటిలాగే నర్సీపట్నంలోని వీరబాబు వద్దకు వెళ్లేటప్పుడు కారుకు ఏపీ రిజిస్ట్రేషన్ తో ఉన్న నెంబర్ ప్లేట్ ను బిగించుకొని వెళ్లి గంజాయి ఖరీదు చేయడం, అక్కడి నుంచి హైదరాబాద్ మీదుగా కర్ణాటక వెళ్లేలోపు మార్గమధ్యలో కర్ణాటక నెంబర్ ప్లేట్ మార్చడం, ఆ తరువాత మహారాష్ట్ర బోర్డర్ చేరుకునే లోపు మహారాష్ట్ర నెంబర్ ప్లేట్ బిగించుకుంటూ పోలీసులకు చిక్కకుండా గంజాయి వ్యాపారం చేయడం అలవాటుగా మారింది.

*** పక్కా సమాచారంతో పట్టివేత**

విశాఖ ఏజెన్సీ ప్రాంతం నుంచి మారుతీ కారులో మహారాష్ట్రకు గంజాయి రవాణా కొనసాగిస్తున్నారని చౌటుప్పల్ పోలీసులకు శనివారం సాయంత్రం పక్కా సమాచారం అందింది. దీంతో అప్రమత్తమైన చౌటుప్పల్ పోలీసులు స్థానిక ఏసీపీ మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో పంతంగి టోల్ ప్లాజా వద్ద మాటువేశారు. ఆంధ్రప్రదేశ్ నుంచి కారులో గంజాయి రవాణా చేస్తూ నిఖిల్ కైలాస్ గైక్వాడ్ పంతంగి టోల్ ప్లాజా వద్దకు చేరుకున్నాడు. మాట వేసిన చౌటుప్పల్ పోలీసులు వాహనాన్ని గుర్తించారు. వాహనాన్ని తనిఖీ చేయగా, మారుతి కారులో 102కిలోల గంజాయిని 51ప్యాకెట్ లుగా బయటపడ్డాయి. నకుల్ కైలాష్ గైక్వాడ్ పట్టుకొని విచారించగా గంజాయి సరఫరా చేస్తున్నట్లు ఒప్పుకున్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని కోర్టులో హాజరు పరిచినట్లు డీసీపీ రాజేష్ చంద్ర తెలిపారు. నకుల్ కైలాష్ గైక్వాడ్ పై గతంలోను వివిధ పోలీస్ స్టేషన్ లో 4కేసులు నమోదయ్యాయని, గంజాయి సరఫరాలో మరో ఇద్దరిని త్వరలోనే పట్టుకుంటామని డీసీపీ తెలిపారు.

*** గంజాయి నిర్మూలనకు ప్రజలు సహకరించాలి**

గంజాయి నిర్మూలనకు ప్రజలు సహకరించాలని డీసీపీ రాజేష్ చంద్ర అన్నారు. గంజాయి ద్వారా ప్రజలు ముఖ్యంగా యువత తమ జీవితాలను కోల్పోతున్నారని అన్నారు. ఎవరైనా గంజాయి సరఫరా చేస్తున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారిని వివరాలు గోప్యంగా ఉంచబడుతాయని తెలిపారు. డ్రగ్ ఫ్రీ స్టేట్ గా మార్చేందుకు ప్రతి ఒకరు సహకరించాలని కోరారు. అనంతరం నెంబర్ ప్లేట్ గుర్తింపు కాకుండా వాహనాన్ని గుర్తించి గంజాయిని పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన చౌటుప్పల్ పోలీసులను భువనగిరి డీసీపీ రాజేష్ చంద్ర ప్రత్యేకంగా అభినందించారు. ప్రోత్సాహక బహుమతిగా పారితోషికాన్ని అందజేశారు. ఈ విలేకరుల సమావేశంలో ఏసీపీ మధుసూదన్ రెడ్డి, సీఐ మన్మధ కుమార్, ఎస్ఐలు యాదగిరి, కృష్ణ మల్లు, యాదవ రెడ్డి, భూదాన్ పోచంపల్లి ఎస్ఐ భాస్కర్ రెడ్డిలు పాల్గొన్నారు.

## స్మగర్లు, దేశద్రోహులను

# సినిమాల్లో హీరోలుగా చూపిస్తున్నారు

- **హైదరాబాదులో నటి, నిర్మాత కృష్ణవేణి సంస్మరణ సభ**
- **హాజరైన మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు**
- **హీరోల పాత్రలపై దర్శకులు తీరు మార్చుకోవాలని హితవు**
- **చెడ్డ పనులను ఎప్పుడూ గొప్పగా చూపించకూడదని సూచన**



దేశంలో సినీ రంగం పోకడలపై మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు అసంతృప్తి వ్యక్తం చేశారు. సినిమాల్లో హీరో పాత్రల తీరుపై దర్శకులు పద్ధతి మార్చుకోవాలని హితవు పలికారు. ఒకప్పుడు సినిమాల ద్వారా ప్రజలకు మంచి సందేశం వెళ్లేదని... ఇప్పుడు స్మగ్లర్లు, దేశ ద్రోహులు, సమాజంలో తప్పుడు విధానాలు పాటించేవాళ్లతో హీరో పాత్రలకు రూపకల్పన చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది మంచి పద్ధతి కాదని, దీనివల్ల ఎలాంటి సందేశం వెళుతుందో దర్శకులు ఒకసారి ఆలోచించాలని అన్నారు. చెడ్డ పనులను ఎప్పుడూ గొప్పగా చూపించకూడదని, దీని ప్రభావం పిల్లలపై పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సినిమా రంగం బాధ్యతాయుతమైన మాధ్యమంగా ఉండాలని వెంకయ్యనాయుడు అభిలషించారు. ఇటీవల కన్నుమూసిన తెలుగు చిత్ర పరిశ్రమ తొలి తరం నటి, నిర్మాత కృష్ణవేణి సంస్మరణ సభ నేడు హైదరాబాదులో ఫిలింనగర్ కల్చరల్ క్లబ్ లో జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన సందర్భంగా వెంకయ్యనాయుడు ఈ వ్యాఖ్యలు చేశారు.

# శ్రీశైలంలో నకిలీ దర్శన టికెట్లు కలకలం...

ఏపీలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీశైలం భ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామివారిని దర్శించుకునేందుకు నిత్యం వేలాది మంది భక్తులు తరలివస్తుంటారు. ఈ క్రమంలో భక్తుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని కొందరు కేటుగాళ్లు రెచ్చిపోతున్నారు. నకిలీ దర్శన టికెట్లు అంటగడుతూ నిలువునా దోచేస్తున్నారు. దర్శనానికి వెళ్లిన తర్వాత తీరా ఆ టికెట్లు నకిలీవి అని తేలటంతో లబోదిబోమంటున్నారు. తాజాగా శ్రీశైలంలో నకిలీ టికెట్లు విక్రయిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. శ్రీశైలంలో నకిలీ టికెట్లు కలకలం రేపాయి. ఇటీవల కాలంలో భక్తులు తరచూ ఈ తరహా మోసాలకు గురవుతుండటం గుర్తించిన దేవస్థానం సీఈవో మధుసూదన్ రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు శ్రీశైలంలో నకిలీ దర్శనం టికెట్లు అమ్ముతున్న ఇద్దరు కేటుగాళ్లను అరెస్టు చేసి వారిపై కేసు నమోదు చేశారు. పాత దర్శనం టికెట్లును ఎడిటింగ్ చేసి భక్తులు అమ్మి మోసానికి పాల్పడుతున్నట్లు గుర్తించారు. నకిలీ టికెట్ల అమ్మకాలు భక్తులు టికెట్లు కొనుగోలుపై అధికారులు, పోలీసులు ఆరా తీస్తున్నారు. కాగా, ఫిబ్రవరి 14న శ్రీశైలం మల్లన్న దర్శనానికి కొంతమంది భక్తులు వచ్చారు. ఈ క్రమంలో ఇద్దరు వ్యక్తులు వారికి దర్శన టికెట్లు ఇస్తామని చెప్పి భక్తుల నుంచి వేల రూపాయలు తీసుకున్నారు. వాటిని తీసుకుని సదరు భక్తులు క్యూలైన్‌లో నిలబడ్డారు. తమ వంతు రాగానే స్కానింగ్ సెంటర్ దగ్గర టికెట్లు ఇచ్చి లోపలికి వెళ్లడానికి ప్రయత్నం చేశారు. కానీ, ఆ టికెట్లు స్కాన్ కాకపోవడంతో వారిని ఆలయ సిబ్బంది అడ్డుకున్నారు. వాటిని ఫేక్ టికెట్లుగా తేల్చారు.

# తెలంగాణ శాసనసభ, శాసన మండలి ప్రోరోగ్

హైదరాబాద్: తెలంగాణ శాసనసభ, శాసనమండలిని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రోరోగ్ చేశారు. అందుకు అనుగుణంగా నోటిఫికేషన్ జారీ అయింది. డిసెంబరులో ప్రారంభమైన సమావేశాలను ప్రో రోగ్ చేయకుండానే మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతికి సంతాపం, ఎస్సీ వర్గీకరణ, కులగణన నివేదికలపై ప్రక టన కోసం కొనసాగించారు. తాజాగా ఉభయసభలను ప్రోరోగ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఈ నెలలో బడ్జెట్ సమావేశాలు జరగనున్నాయి. దీంతో శాసనసభ, మండలిని ప్రోరోగ్ చేశారు. బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా ఉభయసభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించాల్సి ఉంటుంది. అసెంబ్లీ, మండలిని సమావేశపరిచేందుకు నోటిఫికేషన్ జారీ చేయనున్నారు.



# డయాబెటిక్‌తో దంత సమస్యలు వస్తాయా?



దంతాలపై డయాబెటిక్ తీవ్ర ప్రభావం చూపుతుందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. అసలు డయాబెటిక్‌కు, దంతాలకు ఉన్న సంబంధం ఏంటి? ఎలాంటి సమస్యలు వస్తాయో తెలుసుకుందాం. డయాబెటిక్‌కు, దంతాల ఆరోగ్యానికి ప్రత్యక్ష సంబంధం ఉంది. షుగర్ ఉన్న పేషెంట్ రక్తంలో చక్కెర స్థాయులు అధికంగా ఉండటం. ఇది రెండు రకాలు. మొదటిది.. టైప్-1 డయాబెటిస్. రెండోది.. టైప్-2 డయాబెటిస్. ఎక్కువమందిలో కనిపించేది రెండో రకమే. గర్భిణులలోనూ కొన్నిసార్లు హార్మోన్ మార్పుల వల్ల చక్కెర నిల్వలు పెరిగే అవకాశం ఉంది. కానీ కొద్దిరోజులకే నియంత్రణలోకి వస్తుంది.

టైప్1 డయాబెటిక్ రోగుల్లో జన్యుపరంగానే ఇన్సులిన్ ఉత్పత్తి తక్కువగా ఉంటుంది. డయాబెటిస్‌తో బాధపడే బాలల్లో అయితే.. 20 ఏండ్ల లోపే దంతాలు ఊడిపోవడం మొదలవుతుంది. కనీసం నాలుగు మూల దంతాలు ఊడిపోతే.. దాన్ని టైప్1 డయాబెటిస్‌గా పరిగణిస్తారు. టైప్2లో ఇన్సులిన్ ఉత్పత్తి జరిగినా, షుగర్‌ను నియంత్రించేంత స్థాయిలో ఉండదు. టైప్1, టైప్2.. రెండు డయాబెటిక్ రకాలూ దంతాలపై ఒకేలా ప్రభావం చూపుతాయి. ఒకేరకమైన ఇబ్బందిని కలిగిస్తాయి. గర్భిణులలో హార్మోన్ మార్పుల వల్ల మధుమేహం వచ్చే ప్రమాదం లేకపోలేదు. అయితే, ప్రసవం తరువాత 90 శాతం మందిలో షుగర్ మళ్లీ సాధారణ స్థితికి చేరుకుంటుంది. మధుమేహం తీవ్రంగా ఉన్న సమయంలో సాధారణ రోగుల్లో కనిపించే చిగుళ్లు, దంతాల సమస్యలే.. గర్భిణులనూ ఇబ్బంది పెడతాయి. డయాబెటిక్ పేషెంట్లలో ఇమ్యూనిటీ పడిపోతుంది. హానికర బ్యాక్టీరియాతో పోరాడే సత్తువ సన్నగిల్లుతుంది. ఫలితంగా ఆ బ్యాక్టీరియా నోటిపై ప్రభావం చూపుతుంది. గాయాలు ఓ పట్టాన మానిపోవు. అక్కడితో ఆగకుండా, ఆ బ్యాక్టీరియా కక్షగట్టినట్టు షుగర్ స్థాయులను పెంచుతుంది. దీనివల్ల నోటి ఇన్ఫెక్షన్లు అధికమవుతాయి. అంటే.. నోటిలో ఇన్ఫెక్షన్లు పెరిగితే మధుమేహ తీవ్రత పెరుగుతుంది. మధుమేహ తీవ్రత పెరిగితే నోటిలో ఇన్ఫెక్షన్లు కూడా పెరుగుతాయి. ఈ బంధానికి అడ్డుకట్ట వేయాలి. డయాబెటిస్ రోగులను ప్రధానంగా ఆరురకాల దంత సమస్యలు వేధిస్తాయి. పిప్పిపళ్లు, చిగుళ్ల సమస్య, పెరియో డాంటైటిస్, క్రష్,. డ్రై మౌత్ నోటి దుర్వాసన.

**నివారణ చర్యలు ఇలా..**

మధుమేహం నియంత్రణలో ఉండేలా చూసుకోవాలి. రోజుకు రెండుసార్లు బ్రష్ చేయాలి. ఉదయం లేవగానే ఒకసారి.. రాత్రి పడుకునే ముందు మరోసారి బ్రష్ చేయాలి. రాత్రి బ్రష్ చేసిన తర్వాత ఎలాంటి ఆహారమూ తీసుకోరాదు. సున్నితంగా ఉండే బ్రష్‌లనే ఎంచుకోవాలి. మరీ బలంగా రుద్దినట్టు కాకుండా, ఒక పద్ధతి ప్రకారం తోముకోవాలి. కనీసం రెండు నిమిషాలపాటు బ్రష్ చేయాలి. మూడు నెలలకు ఒకసారి బ్రష్ మార్చాలి. అవసరమైతే, రోజు ఫ్లాసింగ్ చేయాలి. ప్రతి ఆరు నెలలకు ఒకసారి దంత పరీక్షలు చేయించుకోవడం ఉత్తమం. సాధారణ ఆరోగ్యవంతులు ఏడాదికోసారి నిపుణులతో దంతాలను శుభ్రం చేయించుకోవాలి. డయాబెటిస్ ఉన్నవారు ఆ విషయాన్ని దంత వైద్యులకు తప్పక చెప్పాలి. నోటి సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా, వెంటనే డాక్టర్లను సంప్రదించాలి. ధూమపానం కూడా దంతాల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుంది. కాబట్టి, ఆ

**పిప్పిపళ్లు**

మనం తీసుకునే ఆహారంలో ఉన్న చక్కెర, పిండిపదార్థాలకు నోటిలోని బ్యాక్టీరియా వేగంగా స్పందిస్తుంది. దీనివల్ల దంతాలపై సన్నని గార ఏర్పడుతుంది. దీనిలోని రసాయనాలు పంటి పైభాగంలోని ఎనామిల్‌ను, డెంటిన్‌ను దెబ్బతిస్తాయి. దీనివల్ల పిప్పిపళ్లు పుట్టుకొస్తాయి. బ్లడ్ షుగర్ ఎంత పెరిగితే అంత ఎక్కువగా గార పేరుకుపోతుంది. రసాయనాల దాడి అధికమవుతుంది. నోరంతా పిప్పి విస్తరించవచ్చు.

**చిగుళ్ల వ్యాధులు**

వ్యాధి నిరోధక శక్తి తగ్గడంతో హానికర బ్యాక్టీరియా ప్రాబల్యం పెరుగుతుంది. దీనివల్ల గార మరింత గట్టిపడుతుంది. క్రిమి కీటకాలకు చిరునామాగా మారుతుంది. అంతేకాకుండా.. చిగుళ్లనూ దెబ్బతీస్తుంది. దీంతో చిగుళ్లు ఉబ్బడం, రక్తం కారడం తదితర ఇబ్బందులు తలెత్తుతాయి. ఈ సమస్యను 'జింజివైటిస్' అంటారు. దీన్ని చిగుళ్ల వ్యాధికి మొదటి దశగా పరిగణిస్తారు.

**పెరియోడాంటైటిస్**

జింజివైటిస్‌కు సకాలంలో చికిత్స చేయకపోతే.. పంటికింది ఎముకను క్రమంగా తినేయడం మొదలుపెడుతుంది. దీంతో పన్ను వదులైపోతుంది. ఓ దశలో ఊడిపోతుంది. దీన్నే వైద్య పరిభాషలో 'పెరియోడాంటైటిస్' అంటారు. ఈ సమస్య సాధారణ వ్యక్తులలో కంటే డయాబెటిక్ రోగుల్లో మూడురెట్లు అధికం. డయాబెటిక్ రోగుల్లో ఇట్టే దంతాలు కదులుతాయి. అంతే కాకుండా చిగుళ్ల వాపు, చిగుళ్ల నుంచి చీము రావడం తదితర ఇబ్బందులూ వెంటాడతాయి.

**క్రష్**

నాలుకపై ఫంగల్ ఇన్ఫెక్షన్ రావడాన్నే 'క్రష్' అంటారు. ఈ ప్రభావంతో నాలుకపై తెలుపు లేదా ఎరుపు రంగు మచ్చలాంటిది ఏర్పడుతుంది. ఇది కొంతమేర నొప్పిని కలిగిస్తుంది. డయాబెటిస్ రోగుల్లో ఈ సమస్య మరీ అధికం.

**డ్రై మౌత్**

నోట్లో లాలాజలం తగ్గినప్పుడు నోరు పొడిబారుతుంది. దీన్నే 'డ్రై మౌత్' అంటారు. లాలాజలం ఎప్పటికప్పుడు నోటిని శుభ్రపరుస్తుంది. రసాయనాలు మరీ పెరిగిపోకుండా, మరీ తగ్గిపోకుండా సమతౌల్యం చేస్తుంది. లాలాజలం తగ్గడం వల్ల రసాయన స్థాయులు అధికమై నోరు అపరిశుభ్రంగా మారుతుంది. దీంతో పిప్పిపళ్లు తదితర సమస్యలు వెంటాడుతాయి.

**నోటి దుర్వాసన**

నోటి దుర్వాసన వేధిస్తుంది. కాబట్టి మధుమేహం విషయంలో ఎన్ని జాగ్రత్తలు తీసుకుంటారో, దంత సమస్యల విషయం లోనూ అన్ని వైద్యపరమైన చర్యలు తీసుకోవాలి.

**మౌత్‌వాష్..**

ఏదైనా తిన్న తర్వాత మంచినీళ్లతో పుక్కిలించి ఉమ్మడం మంచి అలవాటు. దీనికితోడు.. ముడి ఉప్పును గోరువెచ్చని నీటిలో కలిపి రోజూ నోటిని శుభ్రపర్చు కోవాలి. దీనివల్ల ఇన్ఫెక్షన్లు కొంతమేర నియంత్రణలో ఉంటాయి. వైద్యుల సలహాతో మార్కెట్‌లో లభించే నాణ్యమైన మౌత్‌వాష్‌లనూ వాడవచ్చు. రసాయనాల ప్రభావం లేనివైతే మరీ మంచిది. దీనివల్ల సగానికి సగం హానికర బ్యాక్టీరియాను తొలిదశలోనే వదిలించుకోవచ్చు.





# మీరు తినే ఫుడ్‌లో ఫైబర్ ఉందా?



శరీర ఆరోగ్యానికి తగినంతగా ఫైబర్‌తో కూడిన ఆహారం తీసుకోవడం కీలకం. జీర్ణక్రియ సాఫీగా సాగడం నుంచి కొలెస్ట్రాల్, బ్లడ్ షుగర్ లెవెల్స్ కంట్రోల్ వరకు ఫైబర్‌తో ఎన్నో ప్రయోజనాలున్నాయి. మలబద్ధకాన్ని నివారించి ప్రేగుల కదలికలను ప్రేరేపించి జీర్ణక్రియ సజావుగా సాగేలా చూస్తుంది. ఫైబర్ అధికంగా ఉన్న ఆహార పదార్థాలను తీసుకోవడంతో పాటు ఆరోగ్యకర జీవనశైలిని అనుసరిస్తే ఫైబర్ లోపాలను అధిగమించడంతో పాటు శరీర ఆరోగ్యం మెరుగుపరుచుకోవచ్చు.

ఆరోగ్యానికి కీలకమైన ఫైబర్‌లో రెండు రకాలుంటాయి. నీటిలో కరిగే సాల్యుబుల్ ఫైబర్ రక్తంలో కొలెస్ట్రాల్ లెవల్స్‌ను, బ్లడ్‌షుగర్ లెవెల్స్‌ను తగ్గిస్తుంది. నీటిలో కరగని ఇన్‌సాల్యుబుల్ ఫైబర్ మలబద్ధకాన్ని నివారించి ప్రేవుల కదలికలను ప్రేరేపిస్తుంది. అయితే మనం ఫైబర్ తగినంతగా తీసుకోవడం లేదని పలు సంకేతాల ద్వారా తెలుసుకోవచ్చు. మలబద్ధకం, గ్యాస్, కడుపుబ్బరం, తిన్న వెంటనే ఆకలివేయడం, నీరసం, నిస్సత్తువ, చర్మం నిర్జీవంగా ఉండటం, తీవ్ర అనారోగ్యాల ముప్పు, అధిక కొలెస్ట్రాల్ లెవెల్స్, మలం గట్టిపడటం, విపరీతంగా బరువు పెరగడం లేదా తగ్గడం.. ఈ లక్షణాలు కనిపిస్తే మీరు తినే ఫుడ్‌లో ఫైబర్ శాతం తగ్గినట్లే.







## ట్రూ కాలర్‌లో నయా ఫీచర్..

# ఫ్రాడ్ కాల్స్‌కు చెక్

### ఫ్రాడ్ కాల్స్‌కు చెక్ పెట్టేందుకు నయా ఫీచర్

గుర్తు తెలియని నంబర్ల ఎన్నో ఫ్రాడ్ కాల్స్ వస్తుంటాయి. సైబర్ నేరగాళ్లు కొత్త తరహా మోసాలకు పాల్పడుతూనే ఉన్నారు. ఇటీవల కాలంలో ఏఐ సాయంతో వ్యక్తుల వాయిస్‌ను క్లోన్ చేసి సైబర్ నేరగాళ్లు మోసాలు చేస్తున్నారు. మోసపోయిన విషయం బాధితులకు కూడా కొన్నిసార్లు ఆలస్యంగా తెలుస్తోంది. ఇలాంటి మోసాలకు చెక్ పెట్టేందుకు ట్రూకాలర్ కొత్త ఫీచర్ తీసుకొచ్చింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాయంతో ఏఐ స్కామ్ కాల్స్‌ను గుర్తించేందుకు కొత్త ఫీచర్‌ను తీసుకొచ్చింది. ఏదైనా కాల్ వచ్చినప్పుడు ఆ వాయిస్ ఏఐ సాయంతో జనరేట్ చేసినదా? కాదా? అనేది కొన్ని క్షణాల్లో ట్రూకాలర్‌లోని ఈ ఫీచర్ చెప్పేస్తుంది. అందుకోసం కొన్ని క్షణాల పాటు ఆ వాయిస్‌ను రికార్డు చేసి అనలైజ్ చేస్తుంది. ఇందుకోసం తమ సొంత ఏఐ మోడల్‌ను వాడుతున్నట్లు ట్రూకాలర్ తెలిపింది. సోషల్‌మీడియాలోని వీడియోలతో పాటు కొందరు వ్యక్తుల వాయిస్‌ను ఉపయోగించినట్టు ట్రూకాలర్ తెలిపింది. ఏఐ స్కామ్ కాల్స్‌ను గుర్తిచేందుకు ట్రూకాలర్‌ను డిఫాల్ట్ కాలర్ యాప్‌గా సెట్ చేసుకోవాల్సి ఉంటుంది. ఆపై ఏదైనా అనుమానాస్పద కాల్ వస్తే స్టార్ట్ డిటెక్షన్‌పై క్లిక్ చేస్తే కాల్‌ను రికార్డు చేసికొన్ని వెంటనే దాన్ని అనలైజ్ చేస్తుంది. ఫలితాన్ని నోటిఫికేషన్ రూపంలో తెలియజేస్తుంది. తొలుత అమెరికాలోని ఆండ్రాయిడ్ ప్రీమియం యూజర్లకు ఈ సదుపాయం అందుబాటులోకి తీసుకురానున్నట్లు కంపెనీ తెలిపింది. రాబోయే నెలల్లో భారత్ సహా ఇతర మార్కెట్లకు ఈ సదుపాయం తీసుకొస్తామని కంపెనీ తెలిపింది.

# జీఎస్టీ వసూళ్లలో కీలక పరిణామం..

## ఒక్క నెలలోనే రూ.1.84 లక్షల కోట్ల వసూళ్లు




**న్యూఢిల్లీ:** మార్చి 1 విడుదలైన అధికారిక డేటా ప్రకారం కేంద్ర జీఎస్టీ నుంచి వసూళ్లు రూ.35,204 కోట్లు ఉండగా రాష్ట్ర జీఎస్టీ రూ.43,704 కోట్లు, ఇంటిగ్రేటెడ్ జీఎస్టీ రూ.90,870 కోట్లు, పరిహార సెస్ రూ.13,868 కోట్లుగా ఉన్నాయి. ఫిబ్రవరిలో దేశీయ లావాదేవీల ద్వారా వచ్చే జీఎస్టీ ఆదాయాలు 10.2 శాతం పెరిగి రూ. 1.42 లక్షల కోట్లకు చేరుకోగా దిగుమతుల ద్వారా వచ్చే ఆదాయాలు 5.4 శాతం పెరిగి రూ.41,702 కోట్లకు చేరుకున్నాయి . ఫిబ్రవరిలో జారీ చేసిన మొత్తం రిటర్న్లు రూ.20,889 కోట్లుగా ఉన్నాయి. ఇది గత సంవత్సరంతో పోలిస్తే 17.3 శాతం పెరుగుదల అని, ఫిబ్రవరి 2025లో నికర జీఎస్టీ వసూళ్లు 8.1 శాతం పెరిగి రూ.1.63 లక్షల కోట్లకు చేరుకున్నాయి. అయితే ఫిబ్రవరి 2025లో స్థూల జీఎస్టీ వసూళ్లు రూ.1.84 లక్షల కోట్లుగా ఉంటే జనవరి 2025లో సేకరించిన రూ.1.96 లక్షల కోట్లుగా ఉండడం గమనార్హం.

ఈ సంవత్సరం జీఎస్టీ వసూళ్లు దాదాపు లక్ష్యంలోనే ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. 2025 ఆర్థిక సంవత్సరానికి ఇది సవరించిన అంచనాలు ఆర్థిక లోటును 4.8 శాతంగా నిర్ణయించడంతో బడ్జెట్‌లో పేర్కొన్న 4.9 శాతం కంటే తక్కువగా ఉందని వివరిస్తున్నారు. దేశీయ జీఎస్టీ సేకరణలో 10.1 శాతం వృద్ధితో పోలిస్తే దిగుమతులపై జీఎస్టీ పెరుగుదల 7.2 శాతం మాత్రమే ఉండడం మంచి పరిణామమని నిపుణులు పేర్కొంటున్నారు. ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యంలో భాగంగా జీఎస్టీ వసూళ్లు పెరగడం మంచిదని నిపుణులు వివరిస్తున్నారు. ముఖ్యంగా రీఫండ్‌లలో 15.8 శాతం పెరుగుదల సానుకూల సంకేతమని చెబుతున్నారు.

ఈ ఆర్థిక సంవత్సరం (ఏప్రిల్-ఫిబ్రవరి) ఇప్పటివరకు స్థూల జీఎస్టీ వసూళ్లు 9.4 శాతం పెరిగి రూ. 20.13 లక్షల కోట్లకు చేరుకోగా నికర జీఎస్టీ వసూళ్లు 8.6 శాతం పెరిగి రూ.17.79 లక్షల కోట్లకు చేరుకున్నాయి. ఫిబ్రవరిలో జారీ చేసిన సగటు కంటే ఎక్కువ రీఫండ్‌లు నికర జీఎస్టీ వసూళ్ల సంఖ్యల్లో సగటు కంటే తక్కువ వృద్ధి రేటుకు దారితీశాయని మరికొంతమంది నిపుణులుపేర్కొంటున్నారు. కేంద్ర నిర్మాణాల ద్వారా వసూళ్ల వృద్ధి రేటు, రాష్ట్ర నిర్మాణాల ద్వారా వసూళ్ల వృద్ధి రేటు కంటే ఎక్కువగా ఉందని, ఇది కేంద్ర నిర్మాణాల దర్యాప్తు విభాగాల గణనీయమైన విజయాల వల్ల సాధ్యమైందని పేర్కొంటున్నారు.

# డీబీటీ పథకాల్లో సరికొత్త రికార్డు..

## ఏకంగా 60 కోట్ల మందికి లబ్ధి



**న్యూఢిల్లీ:** భారతదేశంలో 60 కోట్ల మంది లబ్ధిదారులకు డీబీటీ పథకం ద్వారా ప్రయోజనం చేకూర్చామని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఇటీవల ప్రకటించారు. 1100 డీబీటీ పథకాలతో పాటు 1,200కి పైగా కేంద్ర, రాష్ట్ర పథకాల లబ్ధిని నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకే జమ చేశామని పేర్కొన్నారు. ముఖ్యంగా పబ్లిక్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ద్వారా ఈ తరహా విజయం సాధ్యమైందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రశంసించారు. 49వ సివిల్ అకౌంట్స్ డేలో ఈ మేరకు ప్రకటన చేశారు.

49వ సివిల్ అకౌంట్స్ డేలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ జీఈఎం, జీఎస్టీఐఎన్, టీఐఎన్ 2.0, పీఎం కిసాన్ సహా అనేక ఇతర ప్లాట్‌ఫారమ్‌ల వంటి 250 కంటే ఎక్కువ అవుట్ గోయింగ్ వ్యవస్థలతో అనుసంధానం చేయడం ద్వారా పీఎఫ్ఎంఎస్ ఎండ్-టు-ఎండ్ డిజిటలైజేషన్‌లో కూడా సహాయపడిందని పేర్కొన్నారు. డిపార్ట్‌మెంటలైజేషన్ నుంచి డిజిటలైజేషన్ వరకు చేసే ప్రయాణంలో ఇండియన్ సివిల్ అకౌంట్స్ సర్వీస్ పీఎఫ్ఎంఎస్ ద్వారా నిశ్శబ్ద విప్లవాన్ని తీసుకువచ్చామన్నారు.

31 రాష్ట్ర ట్రెజరీలు, 40 లక్షల ప్రోగ్రామ్ అమలు సంస్థలను ఏకీకృతం చేయడం ద్వారా సహకార సమాఖ్యవాదాన్ని బలోపేతం చేయడానికి పీఎఫ్ఎంఎస్ సాయం చేసిందని వివరించారు. లక్షలాది మంది పౌరులకు ప్రభుత్వ నిధుల సకాలంలో, పారదర్శకంగా పంపిణీని చేయడంలో పీఎఫ్ఎంఎస్ పాత్ర మరువలేనదని స్పష్టం చేశారు.

# నయా ఈవీ ఆటో రిలీజ్ చేసిన బజాజ్..



**న్యూఢిల్లీ:** బజాజ్ ఆటో లిమిటెడ్ బజాజ్ గోగో అనే ఎలక్ట్రిక్ త్రీ-వీలర్ బ్రాండ్‌ను విడుదల చేసింది. ఈ త్రీవీలర్ ఆటోను ఓ సారి ఛార్జ్ చేస్తే 251 కిలోమీటర్ల పరిధిని అందిస్తుందని కంపెనీ ప్రతినిధులు చెబుతున్నారు ఇప్పటికే బజాజ్ కంపెనీ మూడు ప్యాసింజర్ వేరియంట్‌లను ఆవిష్కరించింది. పీ5009, పీ5012,పీ7012 అని మూడు ప్యాసింజర్ వాహనాలను రిలీజ్ చేశారు. పీ 5009 ధర రూ.3,26,797, పీ7012 ధర రూ.3,83,004 (ఎక్స్-షోరూమ్ ఢిల్లీ) నుంచి ప్రారంభమవుతుంది. అయితే కొత్త బజాజ్ గోగో గురించి దేశవ్యాప్తంగా ఉన్న అన్ని బజాజ్ ఆటో డీలర్‌షిప్‌లలో బుకింగ్‌లు ప్రారంభమయ్యాయి. గోగో లైన్ మెరుగైన పనితీరు కోసం రెండు-స్పీడ్ ఆటోమేటెడ్ ట్రాన్స్‌మిషన్‌ను పరిచయం చేస్తుంది.

పీ అంటే ప్యాసెంజర్ వాహనాలను సూచిస్తాయని, '50', '70' పరిమాణ వర్గాలను సూచిస్తాయని నిపుణులు చెబుతున్నారు. '09', '12' వరుసగా 9 కేడబ్ల్యూహెచ్, 12 కేడబ్ల్యూహెచ్ బ్యాటరీ సామర్థ్యాలను సూచిస్తాయని వివరిస్తున్నారు. ఈ వాహనాలు పూర్తి మెటల్ బాడీ నిర్మాణం, ఆటో హజార్డ్, యాంటీ-రోల్ డిటెక్షన్ వంటి అధునాతన భద్రతా వ్యవస్థలను కలిగి ఉంటాయని పేర్కొంటున్నారు. ఎల్ఈడీ లైటింగ్, హిల్ హోల్డ్ అసిస్ట్ కార్యాచరణ, ఐదు సంవత్సరాల బ్యాటరీ వారెంటీ ఉన్నాయని నిపుణులు వివరిస్తున్నారు. మెరుగైన సామర్థ్యాలను కోరుకునే ఆపరేటర్ల కోసం బజాజ్ రిమోట్ ఇమ్మొబిలైజేషన్, రివర్స్ అసిస్ట్ వంటి అదనపు ఫీచర్లతో 'ప్రీమియం టెక్‌ప్యాక్'ను అందిస్తుంది.

బజాజ్ ఆటో లిమిటెడ్‌లోని ఇంట్రా సిటీ బిజినెస్ యూనిట్ ప్రెసిడెంట్ సమర్‌దీప్ సుబంధ్ మాట్లాడుతూ బజాజ్ గోగో శ్రేణి త్రిచక్ర వాహనాల విలువపరంగా ది బెస్ట్ అని నిపుణులు వివరిస్తున్నారు. 251 కిలోమీటర్ల వరకు ధృవీకరించిన శ్రేణి, సెగ్మెంట్ ఫస్ట్ ఫీచర్లతో పాటు బజాజ్ విశ్వసనీయత, బజాజ్ గోగో ఆదాయాలను పెంచుకోవాలని పేర్కొంటున్నారు. అల్టాగ డౌన్‌టైమ్, నిర్వహణ ఇబ్బందులను తగ్గించాలని చూస్తున్న కస్టమర్లకు సమగ్ర పరిష్కారాన్ని అందిస్తుందని వివరిస్తున్నారు. బజాజ్ ప్రస్తుతం ఈవీ ప్యాసింజర్ వాహనాలపై దృష్టి పెడుతుంది. బజాజ్ రాబోయే నెలల్లో కార్గో వేరియంట్లు రిలీజ్ చేసే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు.



# కివీస్‌ను చుట్టేసిన టీమిండియా

**కివీస్‌ను 44 పరుగుల తేడాతో ఓడించిన టీమిండియా**

**5 వికెట్లతో న్యూజిలాండ్‌ను కకావికలం చేసిన వరుణ్ చక్రవర్తి**

**గ్రూప్-ఏలో టాపర్‌గా టీమిండియా... సెమీస్‌లో ఆస్ట్రేలియాతో ఢీ**

**మార్చి 4న తొలి సెమీస్ మ్యాచ్**

**మార్చి 5న రెండో సెమీస్‌లో దక్షిణాఫ్రికా వర్సెస్ న్యూజిలాండ్**



**దుబాయి:** ఛాంపియన్స్ ట్రోఫీలో తన చివరి లీగ్ మ్యాచ్‌లో టీమిండియా ఘన విజయం సాధించింది. గ్రూప్-ఏలో జరిగిన ఈ మ్యాచ్ లో టీమిండియా 44 పరుగుల తేడాతో న్యూజిలాండ్ ను ఓడించింది. తద్వారా గ్రూప్-ఏలో అగ్రస్థానం నిలిచింది. ఇక సెమీఫైనల్లో భారత్... ఆస్ట్రేలియా జట్టుతో తలపడనుంది. ఈ మ్యాచ్ మార్చి 4న దుబాయ్ లో జరగనుంది.

ఇక, న్యూజిలాండ్ తో మ్యాచ్ విషయానికొస్తే... మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి తన స్పిన్ మ్యాజిక్ తో అలరించాడు. దుబాయ్ లో జరిగిన ఈ పోరులో టాస్ గెలిచిన కివీస్ బౌలింగ్ ఎంచుకోగా... మొదట బ్యాటింగ్ చేసిన టీమిండియా 50 ఓవర్లలో 9 వికెట్లకు 249 పరుగులు చేసింది. ఓ మోస్తరు స్కోరును కాపాడుకోగలదా అని సందేహాలు వ్యక్తమైనప్పటికీ... స్ఫూర్తిదాయక ఆటతీరు కనబర్చిన భారత్... లక్ష్యఛేదనకు దిగిన కివీస్ ను 45.3 ఓవర్లలో 205 పరుగులకు ఆలౌట్ చేసింది.

వరుణ్ చక్రవర్తి 5 వికెట్లతో టీమిండియా విజయంలో కీలకపాత్ర పోషించాడు. కుల్దీప్ యాదవ్ 2, హార్దిక్ పాండ్యా 1, అక్షర్ పటేల్ 1, రవీంద్ర జడేజా 1 వికెట్ తీశారు. కివీస్ ఇన్నింగ్స్ లో కేన్ విలియమ్సన్ 81 పరుగులతో టాప్ స్కోరర్ గా నిలిచాడు. ఓపెనర్ విల్ యంగ్ 22, కెప్టెన్ మిచెల్ శాంట్నర్ 28 పరుగులు చేశారు.

ఈ మ్యాచ్ తో ఛాంపియన్స్ ట్రోఫీ-2025లో లీగ్ మ్యాచ్ లు పూర్తయ్యాయి. ఈ మ్యాచ్ ఫలితంతో సెమీస్ లో ఎవరు ఎవరితో తలపడతారన్నదానిపై స్పష్టత వచ్చింది. గ్రూప్-ఏ నుంచి భారత్, న్యూజిలాండ్... గ్రూప్-బి నుంచి దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా ఇప్పటికే సెమీఫైనల్స్ కు అర్హత సాధించాయి. మార్చి 4న దుబాయ్ లో జరిగే తొలి సెమీస్ మ్యాచ్ లో భారత



జట్టు ఆస్ట్రేలియాతో... మార్చి 5న లాహోర్ లో జరిగే రెండో సెమీస్ లో దక్షిణాఫ్రికా జట్టు న్యూజిలాండ్ తో ఆడనుంది. మార్చి 9న ఫైనల్ మ్యాచ్ జరగనుంది. సెమీస్ లో భారత్ గెలిస్తే ఫైనల్ మ్యాచ్ దుబాయ్ లోనే జరగనుంది. ఒకవేళ భారత్ సెమీస్ లో ఓడిపోతే ఫైనల్ మ్యాచ్ పాక్ గడ్డపై జరుగుతుంది.

# వరుసగా 10వ మ్యాచ్‌లో టాస్ ఓడిన రోహిత్ శర్మ..




**న్యూఢిల్లీ:** భారత జట్టు కెప్టెన్, హిట్ మ్యాన్ రోహిత్ శర్మ ఖాతాలో ఓ బ్యాడ్ రికార్డు చేరింది. వరుసగా 10 వన్డే ఇంటర్నేషనల్ మ్యాచ్‌లలో టాస్ ఓడిన కెప్టెన్‌గా శర్మ నిలిచాడు. రోహిత్ 2023 నవంబర్ నుంచి 2025 మార్చి వరకు వరుసగా 10 వన్డే మ్యాచ్‌లలో టాస్ ఓడాడు. ఆయనకంటే ముందు వరుసలో మరో ఇద్దరు ఉన్నారు. వెస్టిండీస్ మాజీ కెప్టెన్ బ్రియాన్ లారా 1998 అక్టోబర్ నుంచి 1999 మే వరకు వరుసగా 12 సార్లు టాస్ ఓడాడు. ఆ తర్వాత రెండో స్థానంలో న్యూజిలాండ్ కెప్టెన్ పీటర్ బోరెన్ ఉన్నారు. ఆయన మార్చి 2011 నుంచి ఆగస్టు 2013 వరకు వరుసగా 11 వన్డే మ్యాచ్‌లలో టాస్ ఓడిపోయాడు. కాగా రోహిత్ శర్మ వరుసగా మరో మూడు మ్యాచ్‌లలో టాస్ ఓడితే బ్రియాన్ లారా రికార్డు కూడా బద్దలు కానుంది.



# కోహ్లీపై పాక్ స్పిన్నర్ సంచలన పోస్ట్

**వైరల్‌గా మారిన ట్వీట్**

**కోహ్లీ ఆటను ఆరాధిస్తూ పెరిగినట్లు వెల్లడి**

**తన చైల్డ్ హుడ్ హీరో అంటూ ట్వీట్**

**అతడికి బౌలింగ్ చేసే అవకాశం దక్కడం అదృష్టమని వ్యాఖ్య**

**కరాచీ:** ఛాంపియన్స్ ట్రోఫీ సందర్భంగా భారత్ పాక్ ల మధ్య జరిగిన మ్యాచ్ లో పాక్ స్పిన్నర్ అబ్రార్ అహ్మద్ కనుసైగలు వైరల్ గా మారిన విషయం తెలిసిందే. అద్భుతమైన బాల్ తో శుభ్ మన్ గిల్ ను ఔట్ చేసిన అబ్రార్.. ఆపై చేతులు కట్టుకుని గిల్ వైపు చూస్తూ పెవిలియన్ కు వెళ్లిపోమంటూ సైగ చేశాడు. నాన్ స్ట్రైకర్ ఎండ్ లో ఉన్న కోహ్లీ ఇది గమనించి కాస్త అసహనం వ్యక్తం చేశాడు. అయితే, మ్యాచ్ తర్వాత అబ్రార్ ను కోహ్లీ మెచ్చుకున్నాడు. ఈ క్రమంలోనే తాజాగా కోహ్లీని ఉద్దేశించి అబ్రార్ సోషల్ మీడియాలో పెట్టిన పోస్ట్ వైరల్ గా మారింది. తన చిన్నతనంలో కోహ్లీ ఆటను ఆరాధించేవాడినని అబ్రార్ చెప్పాడు. కోహ్లీ తన చైల్డ్ హుడ్ హీరో అని వెల్లడించాడు. అతడికి బౌలింగ్ చేసే అవకాశం దక్కడం అదృష్టమని వివరించాడు. అతడు కేవలం మ్యాచ్ సమయంలోనే క్రికెటర్‌గా ఉంటాడని, వ్యక్తిగతంగా చాలా మంచివాడని కోహ్లీని మెచ్చుకున్నాడు. మైదానంలో, బయటా స్ఫూర్తి నింపడంలో కోహ్లీ ముందుంటాడని, అదే అతడి గొప్పతనమని అబ్రార్ చెప్పాడు.

# దుబాయి మాస్టర్ టూర్‌లో ఛాంపియన్‌గా వెంకట నారాయణమూర్తి

**దుబాయి:** దుబాయి మాస్టర్ టూర్ (400) ఇంటర్నేషనల్ టెన్నిస్ టోర్నమెంట్‌లో 55 ప్లస్ మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో హైదరాబాద్ నగరానికి ( కేపీహెచ్‌బీ కాలనీ) చెందిన కొత్వాల వెంకట నారాయణ మూర్తి, ఓల్గా గ్రాడ్జ్ నోవా (రష్యా) తో కలిసి టైటిల్ విజేతగా నిలిచారు. అలాగే పురుషుల డబుల్స్ 55 ప్లస్ విభాగంలో మహారాష్ట్ర పుణేకి చెందిన జితేంద్ర జోషి తో కలిసి కొత్వాల వెంకట నారాయణ మూర్తిల జోడి టైటిల్ రన్నర్ అప్‌గా నిలిచారు.

ఈ సందర్భంగా వెంకట నారాయణమూర్తి మాట్లాడుతూ.. ప్రతిష్టాత్మకమైన టెన్నిస్ టోర్నమెంట్లలో 55 ప్లస్ విభాగంలో మిక్స్‌డ్ డబుల్స్‌లో టైటిల్ విజేతగా పురుషుల డబుల్స్ విభాగంలో రన్నర్ అప్ గా నిలవడం సంతోషంగా ఉందని అన్నారు. దేశానికి, తెలంగాణ రాష్ట్రానికి పేరు ప్రఖ్యాతలు రావడం గర్వంగా ఉందని తెలిపారు. ఈ టోర్నమెంట్ స్ఫూర్తితో రాబోయే టోర్నమెంట్లలో గొప్పగా రాణించి రాష్ట్రానికి పేరు ప్రఖ్యాతలు తీసుకొస్తారని స్పష్టం చేశారు.



# ఓటీటీలోకి రాబోతున్న 'తండేల్'..




**టాకీస్:** నాగచైతన్య, సాయి పల్లవి జంటగా నటించిన తండేల్ సినిమా బాక్సాఫీస్ వద్ద దుమ్మురేపిన విషయం తెలిసిందే. దాదాపు రూ.100 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టి నాగచైతన్య కెరీర్‌లో తొలి రూ.100 కోట్ల చిత్రంగా నిలిచింది. ఈ సినిమాకు చందు మొండేటి దర్శకత్వం వహించగా.. గీతా ఆర్ట్స్ బ్యానర్‌పై అల్లు అరవింద్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఇక థియేటర్లలో ప్రేక్షకులను అలరించిన ఈ చిత్రం ఓటీటీలో వచ్చేందుకు సిద్ధమైంది. ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్ తాజాగా తండేల్ ఓటీటీ అనౌన్స్‌మెంట్‌ను పంచుకుంది. తండేల్ సినిమా మార్చి 07 నుంచి తెలుగుతో పాటు తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో స్ట్రీమింగ్ కాబోతున్నట్లు చిత్రయూనిట్ వెల్లడించింది.

ఈ సినిమా కథ విషయానికి వస్తే.. శ్రీకాకుళం జిల్లా మత్స్యలేశ్యం గ్రామానికి చెందిన జంట రాజు (నాగచైతన్య), సత్య (సాయిపల్లవి). ఇద్దరూ మత్యకారుల కుటుంబాలకు చెందినవారే. చిన్నప్పట్నుంచీ కలిసి పెరిగారు. కలిసి బతకాలనుకున్నారు. సత్యకు రాజు అంటే ప్రాణం. రాజుకు సత్యే లోకం. రాజు చేపల వేటకు వెళ్లి నెలల తరబడి రాకపోయినా అతని జ్ఞాపకాలతో బతికేస్తుంది సత్య. తనవారికోసం నిలబడే తెగువ, ధైర్యం, మంచితనం.. ఇవన్నీ రాజును తమ జాతికి తండేల్‌గా నిలబెట్టాయ్. అయితే.. చాపలవేటకు వెళ్లి సముద్రంలో ప్రాణాలు కోల్పోతున్న తనవాళ్లను చూస్తూ సత్య మనసులో కలవరం మొదలైంది. ఎలాగైనా రాజుతో చేపలవేట మాన్పించాలని ప్రయత్నించింది. కానీ.. రాజు మాత్రం సత్య మాట వినలేదు. బాధ్యత కోసం కట్టుబడి, తనను నమ్ముకున్నవారి కోసం వేటకు వెళ్లాడు. సత్య మనసు గాయపడింది. తన మాటను పెడచెవిన పెట్టిన రాజును మనసులోంచి చెరిపేయాలనుకుంది. మరొకరితో పెళ్లికి సిద్ధమైంది. ఇంతలో పిడుగులాంటి వార్త. సముద్రంలో చేపలవేటకు వెళ్లిన రాజు బృందం.. అక్కడ తుఫాన్‌లో చిక్కుకొని, అందులోంచి బయట పడే ప్రయత్నంలో తమ ప్రమేయం లేకుండానే పాకిస్తాన్ సముద్ర జలాల్లోకి ప్రవేశించి పాకిస్తాన్ నేవీ అధికారులకు దొరికిపోయారు. ఈ వార్త విని మత్స్యలేశం గ్రామం విలవిలలాడింది. సత్య షాక్‌కు గురైంది. మరి పాకిస్తాన్ కరాచీ సెంట్రల్‌జైల్‌లో బంధీలుగా ఉన్న రాజు బృందం ఎలా బయటపడింది? సత్య వేరొకరిని పెళ్లాడిందా? శత్రుదేశంలో బంధీగా చిక్కుకున్న రాజుకోసం సత్య చేసిన ప్రయత్నాలేంటి? చివరకు సత్య, రాజుల ప్రేమకథ సుఖాంతమైందా? దుఖాంతంగా మిగిలిపోయిందా? ఈ ప్రశ్నలకు సమాధానమే మిగతా కథ.

## 'దిల్‌రూబా' స్టోరీ చెబితే బైక్ గిఫ్ట్‌గా ఇస్తా : కిరణ్ అబ్బవరం

**టాకీస్:** 'క' సినిమాతో సూపర్ హిట్ అందుకున్న యువ నటుడు కిరణ్ అబ్బవరం ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'దిల్ రుబా'. ఈ సినిమాకి విశ్వ కరుణ్ దర్శకత్వం వహిస్తుండగా.. రవి, జోజో, జోస్, రాకేష్ రెడ్డి నిర్మిస్తున్నారు. రుక్సర్ థిల్లాన్ కథానాయికగా నటిస్తుండగా.. మార్చి 14న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా ప్రమోషన్స్‌లో పాల్గొంటుంది చిత్రయూనిట్. అయితే ఈ సినిమా ప్రమోసన్స్‌లో భాగంగా ఆసక్తికర ప్రకటనను చేశాడు కిరణ్. 'దిల్ రుబా' సినిమా కథ చెబితే ఈ సినిమాలో వాడిన బైక్‌ను గిఫ్ట్‌గా ఇస్తానంటూ ప్రకటించాడు.

నా ప్రేమ, కోపం సమ్మేళనంగా తెరకెక్కిన చిత్రమే 'దిల్ రూబా'. ఈ సినిమాలో వాడిన బైక్ అంటే నాకు చాలా ఇష్టం. మా ఆర్ట్ డైరెక్టర్ ఈ బైక్‌ని చాలా కష్టపడి ప్రత్యేకంగా తీర్చిదిద్దాడు. బయట ఎక్కడ ఇలాంటి బైక్ కనిపించదు. ఇంత ఇష్టమైన బైక్‌ని మీకు గిఫ్ట్‌గా ఇచ్చేద్దాం అనుకుంటున్నా. ఈ బైక్ మీరు సొంతం



చేసుకోవాలి అంటే మీరు చేయాల్సింది ఒక్కటే. ఇప్పటివరకూ విడుదలైన దిల్ రూబా పాటలు కావచ్చు, వీడియోలు కావచ్చు, ప్రమోషన్స్‌లో మేము మాట్లాడిన విషయాలు కావచ్చు. వీటిని ఆధారంగా చేసుకుని ఈ సినిమా కథ ఏమిటనేది మీరు ఆలోచించి చెప్పాలి. మోస్ట్ క్రియేటివ్‌గా ఎవరైతే చెబుతారో వారికి ఈ బైక్‌ని దిల్ రూబా సినిమా ప్రీ రిలీజ్ వేడుకలో ఇస్తాను. అంతేగాకుండా ఈ కంటెస్ట్ గెలిచిన వారితో దిల్ రూబా ఫస్ట్ డే ఫస్ట్ షో కలిసి చూస్తాను అంటూ కిరణ్ చెప్పుకోచ్చాడు.

# గ్లామర్ ఓవర్ లోడెడ్..

## అందాలతో సెగ పుట్టిస్తున్న రకుల్



టాకీస్: గ్లామర్ బ్యూటీ రకుల్ ప్రీత్ సింగ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. అందం అభినయం ఈ ముద్దుగుమ్మ సొంతం. ఈ అమ్మడు ఈ మధ్య తన వరస ఫొటోషూట్‌తో సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. తాజాగా ఈ బ్యూటీ తన అందాలతో కుర్రకారుకు గ్లామర్ ట్రీట్ ఇచ్చింది. ట్రెండీ డ్రెస్‌లో మతి పొగొడుతుంది. అందాల ముద్దుగుమ్మ రకుల్ ప్రీత్ సింగ్ వెంకటాద్రి ఎక్స్ ప్రెస్ మూవీతో తెలుగు చిత్ర పరిశ్రమలోకి అడుగు పెట్టింది. ఈ మూవీతో మంచి ఫేమ్ సంపాదించుకున్న ఈ ముద్దుగుమ్మ తర్వాత వరసగా ఆఫర్స్ అందుకుంది. కెరీర్ స్టార్టింగ్‌లో టాలీవుడ్ ను షేక్ చేసిన ఈ బ్యూటీ, స్టార్ హీరోల సరసన ఆఫర్స్ అందుకొని అనతి కాలంలోనే స్టార్ హీరోయిన్ అయిపోయింది. ఇక ఈ అమ్మడుకు తెలుగులో అవకాశాలు తగ్గడంతో, బాలీవుడ్ వైపు కన్నేసి అక్కడ తన గ్లామర్‌తో అందరినీ ఆకట్టుకుంది. అంతే కాకుండా బాలీవుడ్ నటుడు నిర్మాత జాకీ భగ్నానీ నీ ప్రేమించి, పెళ్లి చేసుకున్న విషయం తెలిసిందే. ఇక పెళ్లి తర్వాత ఈ ముద్దుగుమ్మ ఓ వైపు సినిమాలు, మరో వైపు తన బిజినెస్‌లలో ఫుల్ బిజీ అయిపోయింది.

ఇక ఎప్పుడూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే ఈ చిన్నది తాజాగా తన లేటెస్ట్ ఫొటో షూట్‌తో కుర్రకారు మనసు దోచేసుకుంది. మెరూన్ కలర్ ట్రెండీ డ్రెస్‌లో తన కైపెక్కించే చూపులతో ఫొటోలకు ఫోజులిచ్చింది. ప్రస్తుతం ఈ పిక్స్ సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి.

టాకీస్: నటి పూనం కౌర్ గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. తెలుగులో చేసింది కొన్ని సినిమాలే అయినా ఈ పంజాబీ బ్యూటీకి తెలుగులో మంచి గుర్తింపు ఉంది అని చెప్పవచ్చు. అయితే ఈ భామ ఈ మధ్య వరుసగా దర్శకుడు త్రివిక్రమ్‌ని విమర్శిస్తూ పోస్టులు పెడుతున్న విషయం తెలిసిందే. త్రివిక్రమ్ ఎలాంటి వాడో, ఆయన చెడు స్వభావం ఎంటో నాకు తెలుసు. ఇతరుల జీవితాలను త్రివిక్రమ్ నాశనం చేస్తారు. అంటూ అప్పట్లో సంచలన వ్యాఖ్యలు చేసింది. ఇదిలావుంటే తాజాగా పోసాని కృష్ణ మురళి అరెస్ట్‌పై పూనం కౌర్ స్పందిస్తూ.. ఈ విషయంలో కూడా త్రివిక్రమ్‌ను లాగి మరోసారి అతడిపై ఆరోపణలు చేసింది.

సోషల్ మీడియా వేదికగా పూనం స్పందిస్తూ.. పోసాని కృష్ణ మురళి చేసిన మరో తప్పు త్రివిక్రమ్ శ్రీనివాస్‌ను ఇండస్ట్రీలోకి తీసుకురావడం అంటూ కామెంట్ చేసింది. దీంతో ఈ కామెంట్ ప్రస్తుతం వైరల్‌గా మారింది.

# త్రివిక్రమ్‌పై మరోసారి సంచలన ఆరోపణలు చేసిన పూనమ్ కౌర్



పూనమ్ కౌర్ గతంలోనూ త్రివిక్రమ్‌పై పలు సందర్భాల్లో ఆరోపణలు చేసింది. ఆమె తన కెరీర్‌లో ఎదుర్కొన్న ఇబ్బందులకు త్రివిక్రమ్ కారణమని, మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్‌కి ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కాలేదని గతంలో పేర్కొంది.







# నితిన్ 'రాబిన్‌హుడ్'కి పోటీగా వస్తున్న 'మ్యాడ్ స్క్వేర్'

**టాకీస్:** టాలీవుడ్ హీరో నితిన్, వెంకీ కుడుముల కాంబోలో వస్తున్న తాజా చిత్రం రాబిన్‌హుడ్. భీష్మ సినిమా తర్వాత వీరిద్దరి కాంబినేషన్‌లో ఈ సినిమా వస్తుండటంతో ప్రేక్షకులలో భారీ అంచనాలు ఉన్నాయి. ఈ సినిమాను మార్చి 28న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు మేకర్స్. ఈ సినిమా విషయానికి వస్తే.. నితిన్ ఇందులో రాబిన్ హుడ్ అనే దొంగ పాత్రలో నటిస్తున్నాడు. ఈ చిత్రంలో శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తుండగా.. వెన్నెల కిషోర్, రాజేంద్రప్రసాద్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. అయితే ఇదే రోజు మరో క్రేజీ ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. టాలీవుడ్ టాప్ ప్రొడక్షన్ హౌజ్ సితార ఎంటర్‌టైనమెంట్స్ నుంచి వస్తున్న తాజా ఎంటర్‌టైనర్ మ్యాడ్ స్క్వేర్. "మ్యాడ్" చిత్రానికి సీక్వెల్‌గా రూపొందుతోన్న ఈ చిత్రం యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా రాబోతుంది. ఈ చిత్రంలో నార్నే నితిన్, సంగీత్ శోభన్, రామ్ నితిన్, విష్ణు ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. కళ్యాణ్ శంకర్ దర్శకత్వంలో వస్తున్న ఈ సినిమాను సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తుండగా.. మార్చి 28, 2025న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ రెండు చిత్రాలు ఒకే సమయంలో రావడంతో బాక్సాఫీస్ వద్ద పోటీ ఉండే అవకాశం కనిపిస్తోంది. అయితే "రాబిన్‌హుడ్" ఒక యాక్షన్ థ్రిల్లర్‌గా రాబోతుండగా.. "మ్యాడ్ స్క్వేర్" యూత్‌ని ఆకట్టుకునే కామెడీ ఎంటర్‌టైనర్‌గా రాబోతుండడంతో ప్రేక్షకుల ఏ జానర్ నచ్చితే ఆ జానర్‌లో సినిమాకి వెళ్లే అవకాశం కనిపిస్తుంది.

# ఆంధ్ర రాజకీయాలపై దేవకట్టా వెబ్ సిరీస్..



టాకీస్: టాలీవుడ్ దర్శకుడు దేవకట్టా గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. వెన్నెల, ప్రస్థానం, ఆటోనగర్ సూర్య, రిపబ్లిక్ వంటి సినిమాలతో తనకంటూ మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు. ఇక దేవకట్టా సినిమాలు అటు రాజకీయ కోణంతో పాటు సామజిక సమస్యలను ప్రతిబింబించేలాగా ఉంటాయి. అయితే రిపబ్లిక్ తర్వాత చాలా రోజులు గ్యాప్ తీసుకున్న దేవకట్టా ఒక వెబ్ సిరీస్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు తెలుస్తుంది.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డితో పాటు ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిపై అని తెలుస్తుంది. అవును వైఎస్ రాజశేఖర్ రెడ్డి, చంద్రబాబు నాయుడు కాలేజ్ టైంలో మంచి స్నేహితులన్న విషయం తెలిసిందే. వీరిద్దరు అప్పుడు యూత్ కాంగ్రెస్‌లో కీలక పాత్రలను పోషించారు. అయితే వీరిద్దరు కాలేజ్‌లో ఉన్న సమయంలో వాళ్ల ఫ్రెండ్‌షిప్ ఎలా ఉంది అనే దానిపై వెబ్ సిరీస్‌ను తెరకెక్కిస్తున్నారు దేవకట్టా. కాగా ఈ ప్రాజెక్ట్‌పై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

రాజకీయ నేపథ్యంతో కూడిన డ్రామాతో రాబోతున్న ఈ వెబ్ సిరీస్‌లో చంద్రబాబు పాత్రలో ఆది పినిశెట్టి నటించబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. అలాగే వైఎస్ఆర్ పాత్రలో చైతన్య రావు నటించనున్నాడని సమాచారం. జేడీఆర్ అనే వర్కింగ్ టైటిల్‌తో రాబోతున్న ఈ వెబ్ సిరీస్ 70 కోట్ల బడ్జెట్‌తో రానుంది.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.